manavishwam.com

# మన విశ్వం

VOICE OF THE PEOPLE-POWER OF TRUTH

తెలుగు వార్తా దినపత్రిక

MANAVISHWAM TELUGU DAILY

వరంగల్ | సంపుటి : 01 | సంచిక : 44 | శుక్రవారం, జూలై 31 2026 | పేజీలు - 8 | వెల : 5/-

పెద్ది సుదర్శన్ రెడ్డి

## కన్నుమూత



2లో

విద్య కోసం ఎంత ఖర్చైనా

## వెనుకాడం..!

- "ఏం కావాలో చెప్పండి... ఎలాగైనా తెచ్చిస్తా"
- ఉపాధ్యాయులకు సీఎం రేవంత్ భరోసా
- 2034 వరకు నేనే సీఎం.. ప్రభుత్వ పాఠశాలలే తెలంగాణ భవిష్యత్తుకు పునాది



**హైదరాబాద్, జూలై 30 (మన విశ్వం):** తెలంగాణను దేశంలోనే విద్యారంగంలో అగ్రగామిగా నిలబెట్టడమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. విద్యాభివృద్ధికి అవసరమైన ప్రతి వనరును సమకూర్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, "ఏంకావాలో చెప్పండి.. ఎలాగైనా తెచ్చిస్తా " అంటూ ఉపాధ్యాయులకు భరోసా ఇచ్చారు. ప్రపంచ స్థాయి విద్యా విధానాలను తెలంగాణలో అమలు మిగతా 2లో...

ఉత్తర తెలంగాణను

# ముంచెత్తిన వానలు

- వాయుగుండం ప్రభావంతో ఎడతెరిపి లేని భారీ వర్షాలు
- రెండు జిల్లాల్లో విద్యాసంస్థలకు సెలవు
- మేడారం జంపన్న వాగులో భక్తుడు గల్లంతు
- లోతట్టు ప్రాంతాలకు వరద ముప్పు.. అప్రమత్తమైన యంత్రాంగం



**తెలంగాణ బ్యూరో , జూలై 30 (మన విశ్వం):** బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో తెలంగాణ వ్యాప్తంగా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తున్నాయి. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు సాధారణ జనజీవనాన్ని అస్తవ్యస్తం చేశాయి. వాగులు, వంకలు, చెరువులు పొంగిపొర్లుతుండగా, పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. లోతట్టు కాలనీలు నీటమునిగి పోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిర్మల్, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారింది. భారీ వర్షాలకు వాగులు ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తుండటంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. అనేక చోట్ల రహదారులపై వరద నీరు చేరగా, వంతెనలపై నుంచి ప్రవాహం కొనసాగుతోంది. దీంతో ఆయా మార్గాల్లో రాకపోకలను అధికారులు నిలిపివేసి, ప్రజలు అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు చేయవద్దని హెచ్చరికలు జారీ చేశారు. మిగతా 2లో...

యువ ఇంజినీర్లను

## అవమానించొద్దు..!



- 'క్రిమినల్ వేస్ట్' వ్యాఖ్యలు వెనక్కి తీసుకోండి
- సీఎం రేవంత్‌పై కేటీఆర్, హరీశ్‌రావు తీవ్ర విమర్శలుతెలంగాణ
- యువతకు క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ నేతల డిమాండ్

**హైదరాబాద్, జూలై 30 (మన విశ్వం):** తెలంగాణ యువ ఇంజినీర్లపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసినట్లు ప్రచారంలోకి వచ్చిన 'క్రిమినల్ వేస్ట్' వ్యాఖ్యలపై బీఆర్ఎస్ తీవ్రస్థాయిలో మండిపడింది. తెలంగాణ యువత ప్రతిభను కించపరిచేలా మాట్లాడడం ముఖ్యమంత్రి అహంకారానికి మిగతా 2లో...

## బీజేపీలో చేరాలని బెదిరింపులు

- కుటుంబాన్ని చంపేస్తామంటూ ఫోన్లు చేస్తున్నారని ఆవేదన
- విద్యార్థులపై పెల్లెట్ గన్స్ ప్రయోగంపై, అమిత్ షాపై విమర్శలు



**ఛత్రపతి శంభాజీనగర్, జూలై 30:** కాక్రాచ్ జనతా పార్టీ చీఫ్ అభిజీత్ దీప్కే బీజేపీపై సంచలన ఆరోపణలు చేశారు. తాను బీజేపీలో చేరాలని ఒత్తిడి తెస్తున్నారని, చేరకపోతే తన కుటుంబాన్ని హత్య చేస్తామని బెదిరింపులు వస్తున్నాయని ఆరోపించారు. మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీనగర్‌లో గురువారం మీడియాతో మాట్లాడిన ఆయన, తనకు పలుమార్లు బెదిరింపు ఫోన్ కాల్స్ వచ్చినట్లు తెలిపారు. బీజేపీలో చేరితే తనకు, తన కుటుంబానికి ఎలాంటి ఇబ్బందులు ఉండవని ప్రలోభపెడుతున్నారని, నిరాకరిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరిస్తున్నారని పేర్కొన్నారు. దేశంలో అత్యున్నత పదవుల్లో ఉన్న వ్యక్తులే ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని మిగతా 2లో...

డీఎంహెచ్‌వోగా డా. రాజారెడ్డి..

## నేడు బాధ్యతల స్వీకరణ

- వరంగల్ వైద్యశాఖలో కీలక మార్పు
- డా. సాంబశివరావుకు బదిలీ..
- వైద్యశాఖలో చర్చనీయాంశమైన పరిణామం



**వరంగల్, జూలై 30 (మన విశ్వం):** వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో ప్రభుత్వం కీలక మార్పులు చేపట్టింది. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారిగా (డీఎంహెచ్‌వో) డా. రాజారెడ్డిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఆ బాధ్యతలు నిర్వహిస్తున్న డా. సాంబశివరావును ప్రజారోగ్య, కుటుంబ మిగతా 2లో...

వాయుగుండంపై

## హై అలర్ట్

- ప్రజలకు ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు
- రెడ్, ఆరెంజ్ అలర్ట్ జిల్లాల్లో యంత్రాంగం అప్రమత్తం
- అధికారులతో మంత్రి పొంగులేటి టెలికాన్ఫరెన్స్



**హైదరాబాద్, జూలై 30 (మన విశ్వం):** ఛత్తీస్‌గఢ్‌పై కొనసాగుతున్న తీవ్ర వాయుగుండం, చురుగ్గా ఉన్న నైరుతి రుతుపవనాల ప్రభావంతో తెలంగాణలో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతా వరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని రాష్ట్ర రెవెన్యూ, విపత్తు నిర్వహణ, గృహనిర్మాణ, సమాచార--పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారు లను ఆదేశించారు. గురువారం రెవెన్యూ, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అధికారులతో మంత్రి టెలికాన్ఫరెన్స్ నిర్వహించి రాష్ట్రంలో కురుస్తున్న వర్షాలు, రానున్న రెండు రోజుల వాతావరణ పరిస్థితులపై సమీక్షించారు. జిల్లా స్థాయిలో రెవెన్యూ యంత్రాంగం అన్ని శాఖలతో సమన్వయం చేసుకుంటూ క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని, ఎలాంటి మిగతా 2లో...

## ఎఫ్ఆర్‌సీ జారీలో జాప్యం..!

- వేలాదిగా పెండింగ్‌లో దరఖాస్తులు
- రెండు రోజుల్లో ఇవ్వాలన్న నిబంధన బేఖాతరు
- మీసేవ కేంద్రాల చుట్టూ ప్రజల ప్రదక్షిణలు
- తహశీల్దార్ల స్థాయిలో నత్తనడకన పరిశీలన




**తెలంగాణ బ్యూరో , జూలై 30 (మన విశ్వం):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న కుటుంబ రిజిస్టర్ సర్టిఫికెట్ (ఎఫ్ఆర్‌సీ) జారీ ప్రక్రియలో తీవ్ర జాప్యం నెలకొంది. దరఖాస్తు చేసిన రెండు పనిదినాల్లోనే సర్టిఫికెట్ జారీ చేయాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ, క్షేత్రస్థాయిలో ఆ నిబంధన అమలు కావడం లేదు. ఫలితంగా రాష్ట్రవ్యాప్తంగా వేలాది దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా, ప్రజలు మిగతా 2లో...

# సంపాదకీయం

## ప్రతిపక్షంగా విఫలం అవుతున్న కాంగ్రెస్ !

ఈ దేశ దౌర్భాగ్యం ఏమంటే అసమర్థ కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉండడం. అధికారంలో ఉంటే అవినీతికి పాల్పడడం, కుంభకోణాలను చేయడం, పాలనను గాలికి వదిలి వేయడం చూశాం. పదేళ్ల యూపిఏ పాలనలో మన్మోహన్ సింగ్‌ను ముందుకు పెట్టి ఎన్ని అరాచకాలు చేశారో చెప్పలేం. అలాగే ప్రతిపక్షంలో గత పదేళ్లుగా నిర్మాణాత్మక పాత్ర పోషించడంలోనూ విఫలం అవుతూ వస్తోంది. నిజానికి ప్రజాస్వామ్యంలో బలమైన ప్రతిపక్షానిదే బలమైన పాత్ర అని చెప్పాలి. దీనిని గుర్తించి నడచుకోవడంలో కూడా కాంగ్రెస్ పూర్తిగా విఫలం అయ్యింది. అధికార ఎన్‌డిఎ తప్పుడు పనులు చేస్తుంటే నిలదీయడం లేదు. ఆశ్రిత పక్షపాతం చూపితే నిలదీయడం లేదు. ప్రజల్లో చైతన్యం తెచ్చే కార్యక్రమాలు చేయడం లేదు. ఎందుకంటే ఆశ్రితపక్షపాతం, బంధుప్రీతి, కుటుంబ పాలన కాంగ్రెస్‌లో నరనరాన జీర్ణించుకుపోయింది. ఇంట్లో ఉన్న ముగ్గురు వ్యక్తులు పార్లమెంట్‌లోనే ఉన్నారు. కుటుంబ పాలనకు ఇదే నిదర్శనం. ఇకపోతే పార్లమెంట్ సమావేశాల్లో కూడా బలంగా ప్రజల వాణిని విన్పించడం లేదు. కాక్రోచ్ పార్టీకి వస్తున్న ఆదరణను తమ ఖాతాలో వేసుకునేందుకు ఎత్తులు వేస్తున్నారు. వారి ఉద్యమాన్ని హైజాక్ చేసి లబ్ది పొందే ప్రయత్నాల్లో ఉన్నారు. ఈ క్రమంలో వారుచేస్తున్న ఆందోళనలు ఎబ్బెట్టుగా ఉన్నాయి. తాజాగా పార్లమెంట్ లోపలా బయటా విద్యార్థులపై లాఠీఛార్జ్‌కు ఎవరు ఆదేశించారో చెప్పాలన్న డిమాండ్ చేస్తున్నారు. పార్లమెంట్ బయట ప్లకార్డులు పట్టుకుని ఆందోళనకు దిగారు. అందరూ గతంలో పాలన చేసిన వారే. కాంగ్రెస్, సమాజ్‌వాదీ, తృణమూల్ అంతా పాలకులుగా ఉండివచ్చిన వారే. లాఠీ ఛార్జ్ చేయమని హోంమంత్రి ఆదేశిస్తారా అన్నది కూడా తెలియని వారు మన పాలనా వ్యవస్తలో ఉండడం దౌర్భాగ్యం. పోలీస్ మాన్యువల్ కూడా తెలియకుండా రాహుల్, ప్రియాంక, అఖిలేశ్ యాదవ్ మాట్లాడుతున్నారు. లా అండ్ ఆర్డర్ కంట్రోల్ తప్పితే పోలీసులే నిర్ణయం తీసుకుని లాఠీఛార్జ్ చేస్తారు. నిషేధిత పార్లమెంట్ పరిసరాల్లో, ప్రధాని నివాసం వద్ద ఎలాంటి ఆందోళనలు జరిగినా తప్పకుండా కంట్రోల్ చేస్తారు. ఇదికూడా తెలియ నట్లుగా ప్లకార్డులు పట్టుకుని లాఠీఛార్జ్‌కు ఎవరు ఆదేశాలిచ్చారో చెప్పాలని నినాదాలు చేయడం సిగ్గుచేటు. ఇది కేవలం రాజకీయంగా చేస్తున్న ఆందోళన తప్ప ఇందులో చిత్తశుద్ధి లేదని వారికి కూడా తెలుసు. అసలు కాంగ్రెస్ నిర్మాణాత్మకంగా వ్యవహరించి ఉంటే ఇవాళ విద్యార్థులు రోడ్డుకెక్కాల్సిన అవసరం వచ్చి ఉండేది కాదు. జూన్ 6న సీజేపీ ఏర్పడడంపై వచ్చిన ప్రతిస్పందన చూసిన తర్వాతగానీ కాంగ్రెస్ గళం విప్పలేదు. మే మొదటి వారంలో పేపర్ లీక్ జరిగి, మే 12న పరీక్ష రద్దయిన తర్వాత కాంగ్రెస్ తీవ్రంగా ప్రతిస్పందించి ప్రభుత్వాన్ని జవాబుదారీ చేసేందుకు చేయాల్సినన్ని ప్రయత్నాలు చేయలేదు. జూన్ 17న రాజస్థాన్‌లోని కోటాలో 'ఛాత్రోంకి గుంజ్' పేరిట విద్యార్థుల ర్యాలీని నిర్వహించిన రాహుల్‌గాంధీ ఆ తర్వాత 23 రోజుల పాటు అదృశ్యమై జర్మనీలో కాలక్షేపం చేశారు. సీజేపీ వ్యవస్థాపకుడు ఢిల్లీలో ప్రవేశించి తమ ఆందోళన తీవ్రతరం చేసిన తర్వాత, పార్లమెంటు సమావేశాలు మరో మూడు రోజుల్లో జరుగుతా యనగా రాహుల్‌లో కలవరం కలిగింది. అందుకే అమాంతంగా లేచి ప్రధాని నివాసం ముందు ధర్నాకు దిగారు. రాజకీయాల్లో నిరంతరత్వం, నిత్య క్రియాశీలత్వం లేకపోతే పరిస్థితి మరొకరి చేతుల్లోకి వెళు తుందన్న విషయం రుజువైంది. మునుపటిలాగా నాటకీయంగా ధర్నాలు చేయడం, అరెస్టు కావడం వల్ల ప్రజల సానుభూతి లభించదని కాంగ్రెస్ గ్రహించాలి. 2014 నుంచీ పార్లమెంట్‌ను కాంగ్రెస్ స్తంభింపజేయడం, నిరసన ప్రదర్శనలు నిర్వహించడం వంటివి చేస్తూనే ఉన్నది. అందంతా కేవలం నాకీయ రాజకీయ ప్రయోజనం కోరి చేస్తున్నవే. కేవలం నెలరోజుల నిరసనతో కాక్రోచ్ పార్టీ ప్రభుత్వాన్ని దిగివచ్చేలా చేయగలిగింది. అటువంటి నైతిక స్థైర్యం కాంగ్రెస్, ప్రతిపక్షాలకు ఎందుకు లేకుండా పోయిందన్నదే ప్రశ్న. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడానికే కాదు, పరీక్షల్లో అక్రమాలను నిరోధించేం దుకు ప్రభుత్వం ఆగమేఘాలపై బిల్లు తేవడానికి, ప్రధానమంత్రి రాత్రి పొద్దుపోయిన తర్వాత ఈ బిల్లు గురించి ప్రకటించడానికి సిజెపి ఉద్యమమే కారణం. నెల రోజులకు పైగా శాంతియుతంగా నిరసన ప్రదర్శన చేస్తూ పరీక్షా పత్రాల లీక్‌కు విద్యామంత్రి నైతిక బాధ్యత వహించాలని కోరిన యువతీ యువకులతో దేశవ్యాప్తంగా ఎంతోమంది కనెక్టయ్యారు. నిజానికి ప్రతి ఉద్యమంలోనూ ఎంతో కొంత హింసాకాండ, విధ్వంసం జరుగుతూనే ఉన్నది. చాలాసార్లు పోలీసుల దమనకాండ అణచితేకు పోలీసులు లాఠీఛార్జ్ షరామమాలే. అంతమాత్రాన మొత్తం ఉద్యమానికి విశ్వసనీయత లేకుండాపోదు. అయి తే ప్రతిపక్షంగా కాంగ్రెస్ విఫలం అవుతూనే ఉంది. ఇప్పుడు రాహుల్ వారిని భుజాన వేసుకుని ఊరేగే ప్రయత్నం చేస్తున్నారు. దీనిని ప్రజలు గమనిస్తున్నారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడాన్ని అవమానంగా భావించనక్కర్లేదు. జరిగిన పరిణామాల్ని ఆత్మావలోకనం చేసుకుని తగిన చర్యలు తీసుకునేందుకు లభించిన అవకాశంగా భావించాలి. కాంగ్రెస్ ఇప్పటికైనా నిర్మాణా త్మక ప్రతిపక్షంగా వ్యవహరించాలి. లేకుంటే కాంగ్రెస్ ప్రతిపక్ష స్థానం కూడా కోల్పోతుంది.

## విధి నిర్వహణలో భయానికి తావు లేదు

- నిజాయితీగా విద్యుక్త ధర్మం నిర్వహించండి
- సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ డైరెక్టర్ జనరల్ జ్ఞానేంద్ర

**న్యూఢిల్లీ,జూలై30:** సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ డైరెక్టర్ జనరల్ జ్ఞానేంద్ర ప్రతాప్ సింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. విధుల్లో ధైర్యసాహసాలు ప్రదర్శించిన సిబ్బందికి సన్మానం చేసిన కార్యక్రమంలో ఆయన ఉత్తేజపూరిత ప్రసంగం చేశారు. ఎలాంటి భయం లేకుండా పనిచేయాలని బలగాలకు పిలుపునిచ్చారు. సీఆర్‌పీఎఫ్ డైరెక్టర్‌గా ఇక్కడ నేను మీకో హామీ ఇస్తున్నాను. విధులు నిజాయతీగా నిర్వర్తించడంలో మీరు తీసుకునే నిర్ణయాలు, చర్యలకు నేను బాధ్యత వహిస్తాను. ప్రజాప్రయోజనం కోసం తీసుకునే చర్యలకు జవాబుదారీగా వ్యవహరించాల్సి వస్తే.. దానిని నేను పూర్తిగా స్వీకరిస్తానని జ్ఞానేంద్ర తన సిబ్బందిని ఉద్దేశించి పేర్కొన్నారు. ఈ నెల 20న 'చలో పార్లమెంటు' నిరసనల సమయంలో భద్రతా విధులు నిర్వర్తించిన సీఆర్పీఎఫ్‌-ఆర్ఏఎఫ్ బలగాలు, పోలీసులు.. విద్యార్థులపై పె÷-లలెట్ గన్‌లతో కాల్పులు జరిపినట్లు ఆరోపణలు వచ్చిన సంగతి తెలిసిందే. దీనిపై విమర్శలు వ్యక్తమవుతోన్న వేళ.. జ్ఞానేంద్ర ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.

ఈ ఆరోపణలపై సీఆర్‌పీఎఫ్ డైరెక్టర్ అంతకుముందు కూడా స్పందించారు. ఏదైనా భారీ ఆపరేషన్ తర్వాత తాము వృత్తిపరమైన మూల్యాంకనం చేపడతామని చెప్పారు. నిరసనకారులపై ఆర్ఏఎఫ్ సిబ్బంది తీసుకున్న చర్యల విషయంలోనూ ఆ పరిశీలన చేస్తామని తెలిపారు. అది తమ నిబంధనల్లో భాగమేనని చెప్పారు. సీఆర్‌పీఎఫ్ బలగాలు దేశవ్యాప్తంగా విధులు నిర్వర్తిస్తున్నారు. రాష్ట్ర పోలీసులతో సహకరిస్తూ.. వైవిధ్య పరిస్థితులకు తగ్గట్టుగా వేగంగా స్పందించగల సామర్థ్యం వారి సొంతం. ఇక, ఏదైనా ప్రాంతంలో ఘర్షణలు, రద్దీ, అశాంతియుత పరిస్థితులను నెలకొన్నప్పుడు వాటిని నియంత్రించేందుకు సీఆర్‌పీఎఫ్‌లోని రాపిడ్ యాక్షన్ ఫోర్స్ ను రంగంలోకి దింపుతారు.

## విద్య కోసం ఎంత ఖర్చైనా

చేయాలంటే ఉపాధ్యాయులే మార్పుకు నాయకత్వం వహించాలని పిలుపునిచ్చారు.
ఫిన్లాండ్, జర్మనీ దేశాల్లో విద్యా విధానాలను అధ్యయనం చేసి వచ్చిన ప్రభుత్వ ఉపాధ్యాయులతో హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో సీఎం మాట్లాడారు. విద్యతోనే వెనుకబాటుతనం తొలగుతుందని, ప్రభుత్వ పాఠశాలలే తెలంగాణ భవిష్యత్తుకు బలమైన పునాదిగా మారాలని ఆయన అన్నారు.

"నేనూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థినే"
తాను కూడా మధ్యతరగతి కుటుంబంలో పుట్టి ప్రభుత్వ పాఠశాలలోనే చదివానని సీఎం గుర్తుచేశారు."గవర్నమెంట్ స్కూల్ లో చదివి ఏమవుతావని అడిగితే.. సీఎం అవుతానని చెప్పాను. నేడు అదే నిజమైంది " అని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు కూడా అత్యున్నత స్థానాలకు చేరుకోగలరనే విశ్వాసాన్ని ప్రతి చిన్నారిలో నింపాలని ఉపాధ్యాయులకు సూచించారు.

ఉపాధ్యాయుల సమస్యలు నా బాధ్యత
ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించే బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం చేసిన సీఎం, పిల్లల విద్యా నాణ్యత, భవిష్యత్తుపై మాత్రం ఉపాధ్యాయ సంఘాలు ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని కోరారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఉపాధ్యాయులతో సమావేశమై విద్యారంగ సంస్కరణలపై చర్చిస్తానని తెలిపారు.

ప్రతి మండలంలో ప్రభుత్వ పాఠశాలే తొలి ఎంపిక
ప్రతి మండలంలో తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలనే మొదటి ఎంపికగా భావించే పరిస్థితి తీసుకురావాలని సీఎం లక్ష్యాన్ని వెల్లడించారు. మౌలిక వసతులు, బోధనా విధానాలు, విద్యా ప్రమాణాలపై క్షేత్రస్థాయిలో పనిచేసే ఉపాధ్యాయుల సూచనల ఆధారంగానే విధానాలు రూపొందాలని అధికారులను ఆదేశించారు.

ప్రభుత్వ కాలేజీలపై నమ్మకం పెరగాలి
ప్రభుత్వ కాలేజీల్లో చదివితే మంచి ఉద్యోగాలు వస్తాయనే నమ్మకాన్ని విద్యార్థులు, తల్లిదండ్రుల్లో పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. విద్య, పిల్లల భవిష్యత్తు కోసం ఎంత ఖర్చైనా ప్రభుత్వం వెనుకాడదని మరోసారి స్పష్టం చేశారు.

విపక్షాలకు ఘాటు సమాధానం
విద్యాశాఖ పనితీరుపై విమర్శలు చేస్తున్న ప్రతిపక్షాలపై సీఎం తీవ్రంగా స్పందించారు. "విద్యార్థులకు అల్పాహారం అందించినందుకా... ఐటిఐ లను ఆధునికరిస్తున్నందుకా... నేను రాజీనామా చేయాలా?" అని ప్రశ్నించారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేసే కార్యక్రమాలు మరింత వేగంగా కొనసాగుతాయని స్పష్టం చేశారు.

జీతాలు, బదిలీలపై స్పష్టత
ఉద్యోగులకు ప్రతి నెల ఒకటో తేదీన జీతాలు చెల్లించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్న సీఎం, "ఒకటో తేదీన జీతాలు ఇవ్వలేని ప్రభుత్వం విఫలమైన ప్రభుత్వమే" అని అన్నారు. ఉపాధ్యాయుల బదిలీలు సాధారణ పరిపాలనా ప్రక్రియ కాదని, వారి సేవల స్వభావాన్ని దృష్టిలో పెట్టుకుని నిర్ణయాలు తీసుకుంటామని తెలిపారు.

## ఉత్తర తెలంగాణను

రెండు జిల్లాల్లో విద్యాసంస్థలకు సెలవు : వర్షాల తీవ్రత దృష్ట్యా నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ హరిత తమ జిల్లాల్లోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, విద్యాసంస్థలకు గురువారం సెలవు ప్రకటించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షించి అవసరమైన తదుపరి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

ములుగులో వరద పరిస్థితి
ములుగు జిల్లాలోనూ కుండపోత వర్షాలు కొనసాగుతున్నాయి. కన్నాయిగూడెం మండలంలో అత్యధిక వర్షపాతం నమోదవడంతో వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. లోతట్టు ప్రాంతాల్లో వరద నీరు చేరే అవకాశం ఉండటంతో అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. ప్రమాదకర ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపారు. అవసరమైన చోట్ల తాత్కాలిక పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి సహాయక చర్యలను వేగవంతం చేశారు.

జంపన్న వాగులో భక్తుడు గల్లంతు
మేడారం సమీపంలోని జంపన్న వాగు ఉగ్రరూపం దాల్చింది. వాగులో స్నానం చేసేందుకు దిగిన ఘట్‌కేసర్‌కు చెందిన ఓ భక్తుడు ప్రవాహానికి కొట్టుకుపోయి గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు, విపత్తు స్పందన బృందాలు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు ప్రారంభించాయి. అయితే ప్రవాహం ఉద్ధృతంగా ఉండటంతో సహాయక చర్యలకు ఆటంకం ఏర్పడుతోంది.

అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక
భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అత్యవసర పరిస్థితులు మినహా బయటకు రావద్దని రాష్ట్ర యంత్రాంగం సూచించింది. నదులు, వాగులు, చెరువుల వద్దకు వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలు అధికారుల సూచనలు పాటించి అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలిపోవాలని విజ్ఞప్తి చేసింది. జిల్లాల వారీగా పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తూ సహాయక, పునరావాస చర్యలను మరింత వేగవంతం చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

## యువ ఇంజినీర్లను

నిదర్శనమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించగా, యావత్ ఇంజినీరింగ్ విద్యార్థులను, వారికి విద్యాబోధన చేసిన ఉపాధ్యాయులను అవమానించారని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు.కేటీఆర్ సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ, దేశానికే అత్యుత్తమ సాంకేతిక నిపుణులను అందిస్తున్న తెలంగాణ యువ ఇంజినీర్లను అవమానించే హక్కు ముఖ్యమంత్రికి ఎవరు ఇచ్చారని ప్రశ్నించారు. తెలంగాణ యువత సామర్థ్యాన్ని కించపరిచేలా మాట్లాడే ముందు తన రాజకీయ, వృత్తిపరమైన అనుభవాన్ని ఒకసారి గుర్తు చేసుకోవాలని సూచించారు. జీవితంలో ఎప్పుడైనా పోటీ పరీక్ష రాశారా? ఏదైనా ఉద్యోగానికి ఇంటర్వ్యూకు హాజరయ్యారా? ఏదైనా వృత్తిపరమైన సంస్థలో పనిచేశారా? అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు.అంతేకాకుండా, రియల్ ఎస్టేట్ బ్రోకర్‌గా ప్రారంభమైన రాజకీయ ప్రయాణం బ్లాక్‌మెయిల్ రాజకీయాల వరకు వెళ్లిందని ఆరోపించిన కేటీఆర్, దివాళా తీసిన కాంగ్రెస్ పార్టీలో ముఖ్యమంత్రి పదవిని కొనుగోలు చేసి అధికారంలోకి వచ్చిన వ్యక్తి తెలంగాణ యువతను అవమానించడం అత్యంత దురదృష్టకరమని విమర్శించారు. ప్రపంచవ్యాప్తంగా తెలంగాణ ఇంజినీర్లు ప్రతిభ చాటుతున్న వేళ ఇటువంటి వ్యాఖ్యలు రాష్ట్ర గౌరవానికే భంగం కలిగిస్తాయని పేర్కొన్నారు. వెంటనే వ్యాఖ్యలను ఉపసంహరించుకుని రాష్ట్ర యువతకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.ఇదే అంశంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు కూడా ఘాటుగా స్పందించారు. ఇంజినీరింగ్ విద్యార్థులను 'క్రిమినల్ వేస్ట్' అని వ్యాఖ్యానించడం ద్వారా లక్షలాది మంది విద్యార్థులను మాత్రమే కాకుండా వారికి విద్యాబోధన చేసిన ఉపాధ్యాయులను కూడా అవమానించారని విమర్శించారు. ప్రపంచంలోని ప్రముఖ సంస్థల్లో తెలంగాణ యువ ఇంజినీర్లు అత్యున్నత స్థానాల్లో పనిచేస్తూ రాష్ట్రానికి, తెలుగు ప్రజలకు గుర్తింపు తీసుకొస్తున్నారని గుర్తుచేశారు."మన పిల్లలు ప్రపంచవ్యాప్తంగా తమ ప్రతిభతో దేశానికి కీర్తి తెస్తుంటే వారిని క్రిమినల్ వేస్ట్ అంటారా? ముఖ్యమంత్రి తన మాటలను వెంటనే వెనక్కి తీసుకోవాలి. ఇంజినీరింగ్ విద్యార్థులకు, ఉపాధ్యాయులకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలి" అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.ఈ వ్యాఖ్యల నేపథ్యంలో రాజకీయ వర్గాల్లో చర్చ కొనసాగుతుండగా, ముఖ్యమంత్రి వ్యాఖ్యలపై అధికార పార్టీ నుంచి ఎలాంటి అధికారిక వివరణ వస్తుందో ఆసక్తిగా మారింది.

## డీఎంహెచ్‌వోగా డా. రాజారెడ్డి..

సంక్షేమ శాఖలో రిపోర్ట్ చేయాలని ఆదేశించింది. కొత్తగా నియమితులైన డా. రాజారెడ్డి నేడు బాధ్యతలు స్వీకరించనున్నారు.ప్రస్తుతం గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ చీఫ్ మెడికల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న డా. రాజారెడ్డికి డీఎంహెచ్‌వో బాధ్యతలను అదనంగా అప్పగిస్తూ ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సంచాలకులు ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా వైద్య సేవల పర్యవేక్షణ, ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాల అమలు, ఆస్పత్రుల పనితీరును పర్యవేక్షించే బాధ్యతలు ఇకపై ఆయన నిర్వహించనున్నారు.ప్రభుత్వ ఆస్పత్రుల్లో సేవల నాణ్యత, వైద్య సిబ్బంది పనితీరు, ప్రజలకు అందుతున్న సేవలపై వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలోనే ఈ పరిపాలనా మార్పు చోటుచేసుకున్నట్లు వైద్యశాఖ వర్గాల్లో చర్చ సాగుతోంది. అయితే ఈ అంశంపై ప్రభుత్వం అధికారికంగా ఎలాంటి కారణాన్ని వెల్లడించలేదు.ఇదిలా ఉండగా, అనారోగ్య కారణాలతో డా. సాంబశివరావు కొద్ది రోజులుగా సెలవులో ఉండటంతో డిప్యూటీ డీఎంహెచ్‌వో డా. ప్రకాశ్ ఇన్‌చార్జి అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. తాజా నియామకంతో జిల్లా వైద్యశాఖ పరిపాలనలో వేగం పెరుగుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.
డా. రాజారెడ్డి ప్రస్తుతం అదనపు బాధ్యతలతో నియమితులయ్యారు. భవిష్యత్తులో ఆయననే పూర్తిస్థాయి డీఎంహెచ్‌వోగా కొనసాగిస్తారా? లేక ప్రభుత్వం మరో అధికారిని నియమిస్తుందా? అన్నదానిపై త్వరలోనే స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

## వాయుగుండంపై

పరిస్థితినైనా ఎదుర్కొనేలా సిద్ధంగా ఉండాలని సూచించారు.
ప్రమాద ప్రాంతాలపై ప్రత్యేక నిఘా
భారీ వర్షాల ప్రభావం ఎక్కువగా ఉండే జిల్లాల్లో పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని మంత్రి ఆదేశించారు. వాగులు, వంకలు, చెరువులు, జలాశయాల వద్ద భద్రతా చర్యలు కట్టుదిట్టం చేయాలని, ప్రమాదకర ప్రాంతాల్లోని ప్రజలను ముందుగానే అప్రమత్తం చేసి అవసరమైతే సురక్షిత ప్రాంతాలు, పునరావాస కేంద్రాలకు తరలించాలని సూచించారు.అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలిజిల్లా కలెక్టర్లు, పోలీసు, రెవెన్యూ, పంచాయతీరాజ్, మున్సిపల్, విద్యుత్, నీటిపారుదల, వైద్య ఆరోగ్య శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి స్పష్టం చేశారు. ఎక్కడైనా అత్యవసర పరిస్థితులు తలెత్తితే తక్షణమే స్పందించి సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

హైదరాబాద్‌పై ప్రత్యేక దృష్టి
రాజధాని హైదరాబాద్‌లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల దృష్ట్యా ట్రాఫిక్, విద్యుత్, తాగునీటి సరఫరాకు ఆటంకం కలగకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. హైడ్రా, జీహెచ్‌ఎంసీ, ట్రాఫిక్ పోలీసులు సమన్వయంతో పనిచేసి ప్రజల సాధారణ జీవనానికి అంతరాయం కలగకుండా చూడాలని చెప్పారు.

వర్షపాతం లోటు భర్తీ
నాలుగు రోజుల క్రితం వరకు రాష్ట్రంలో దాదాపు 30 శాతం మేర ఉన్న వర్షపాతం లోటు, గత రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలతో దాదాపు సాధారణ స్థాయికి చేరుకుందని మంత్రి తెలిపారు.

పలు జిల్లాలకు రెడ్, ఆరెంజ్ అలర్ట్
వాతావరణ శాఖ హెచ్చరికల మేరకు జూలై 30, 31 తేదీల్లో రాష్ట్రంలో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని మంత్రి తెలిపారు.
రెడ్ అలర్ట్ జిల్లాలు: ఆదిలాబాద్, కొమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, జగిత్యాల.
ఆరెంజ్ అలర్ట్ జిల్లాలు: నిజామాబాద్, కామారెడ్డి, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు.
ఈ జిల్లాల్లో జిల్లా కలెక్టర్లు ప్రత్యేక అప్రమత్తతతో వ్యవహరించాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలను మరింత వేగవంతం చేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు.

## ఎఫ్‌ఆర్‌సీ జారీలో జాప్యం..!

మీసేవ కేంద్రాలు, తహశీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ ఇబ్బందులు పడుతున్నారు. జూలై 27 నుంచి ప్రారంభమైన ఎఫ్‌ఆర్‌సీ దరఖాస్తు ప్రక్రియకు రాష్ట్రవ్యాప్తంగా విశేష స్పందన లభించింది. బుధవారం నాటికి 50 వేలకుపైగా దరఖాస్తులు మీసేవ కేంద్రాల ద్వారా నమోదైనట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. అయితే తొలి రోజే దరఖాస్తు చేసుకున్న పలువురికి కూడా ఇప్పటికీ సర్టిఫికెట్లు అందకపోవడంతో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. దరఖాస్తు స్థితి తెలుసుకునేందుకు ప్రతిరోజూ మీసేవ కేంద్రాలకు వెళ్లాల్సి వస్తోందని దరఖాస్తుదారులు వాపోతున్నారు.

రెండు రోజుల్లో జారీ ఎక్కడ..?
ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెం.172 ప్రకారం, దరఖాస్తు అందిన రెండు పనిదినాల్లోగా సంబంధిత తహశీల్దార్ పరిశీలన పూర్తి చేసి ఎఫ్‌ఆర్‌సీ జారీ చేయాలి. కానీ అనేక మండలాల్లో ఈ నిబంధన అమలు కాకపోవడంతో నిర్ణీత గడువు దాటినా దరఖాస్తులు పెండింగ్‌లోనే ఉంటున్నాయి. దీంతో ప్రభుత్వ సేవలపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోంది.

తహశీల్దార్ల లాగిన్ వద్దే నిలిచిపోతున్న ఫైళ్లు
మీసేవ కేంద్రంలో దరఖాస్తు నమోదు చేసిన వెంటనే అది సంబంధిత తహశీల్దార్ లాగిన్‌కు చేరుతుంది. రేషన్ కార్డు వివరాలు, కుటుంబ సమాచారం పరిశీలించి, డిజిటల్ సంతకంతో సర్టిఫికెట్ జారీ చేయాల్సి ఉంటుంది. అయితే ఈ పరిశీలన ప్రక్రియ అనేక చోట్ల నత్తనడకన సాగుతుండటంతో వేలాది ఫైళ్లు తహశీల్దార్ల లాగిన్‌లలోనే పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది.

సిబ్బంది కొరతతో మరింత జాప్యం
దరఖాస్తుల సంఖ్య భారీగా పెరగడం, రెవెన్యూ శాఖలో సిబ్బంది కొరత, ఇతర పరిపాలనా బాధ్యతలతో అధికారులు తీరిక లేకపోవడం వల్లే జాప్యం ఏర్పడుతోందని అధికార వర్గాలు చెబుతున్నాయి. అయితే ప్రజలు మాత్రం ప్రభుత్వం ప్రకటించిన గడువులో సేవలు అందక తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

పెండింగ్ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి అవసరం
ప్రస్తుతం వివిధ ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు, ధ్రువీకరణ అవసరాల కోసం కుటుంబ రిజిస్టర్ సర్టిఫికెట్ కీలక పత్రంగా మారింది. ఈ నేపథ్యంలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన పరిష్కరించి, ప్రభుత్వం నిర్దేశించిన రెండు పనిదినాల్లోనే సర్టిఫికెట్లు జారీ అయ్యేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని దరఖాస్తుదారులు కోరుతున్నారు. ప్రభుత్వం ప్రకటించిన గడువు కచ్చితంగా అమలైతేనే ఈ సేవపై ప్రజల్లో విశ్వాసం మరింత పెరుగుతుందని అభిప్రాయపడుతున్నారు.

## బీజేపీలో చేరాలని

ఆరోపిస్తూ, ఇది ప్రజాస్వామ్యానికి ప్రమాదకర సంకేతమని విమర్శించారు.ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా వంటి అత్యున్నత నాయకులు యువతను భయపెట్టే రాజకీయాలకు పాల్పడటం సరికాదని అభిజీత్ దీప్కే వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యంలో భిన్నాభిప్రాయాలను అణచివేయడం ఆమోదయోగ్యం కాదన్నారు.విద్యార్థుల ఆందోళనల సందర్భంగా పోలీసులు పెల్లెట్ గన్స్ వినియోగించిన ఘటనపై కూడా ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ ఘటనకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా నైతిక బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. అమిత్ షా ఆదేశాల మేరకే పోలీసులు పెల్లెట్ గన్స్ ప్రయోగించి ఉండవచ్చని ఆరోపించారు. తాను స్వయంగా ఆ ఘటనను చూశానని, కొంతమంది విద్యార్థులు కంటి చూపు కోల్పోయారని పేర్కొన్నారు.
బిహార్‌లో విద్యార్థుల నిరసనల సమయంలో ఏకంగా ఏకే-47 ఆయుధాలను కూడా వినియోగించారని ఆరోపించిన ఆయన, ఉగ్రవాదులపై ఉపయోగించాల్సిన ఆయుధాలను విద్యార్థులపై ప్రయోగించడం దురదృష్టకరమన్నారు.విదేశీ నిధులు అందుతున్నాయంటూ ప్రభుత్వ వర్గాలు చేస్తున్న ఆరోపణలు నిజమైతే, అది దేశ భద్రతా వ్యవస్థ వైఫల్యమేనని, అందుకు కేంద్ర హోంమంత్రే బాధ్యత వహించాలని అభిప్రాయపడ్డారు.

## పెద్ది సుదర్శన్ రెడ్డి కన్నుమూత

### బీఆర్ఎస్‌లో విషాదం.. నర్సంపేటలో శోకసంద్రం



**వరంగల్ , జూలై 30 (మన విశ్వం):** నర్సంపేట మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ ఉద్యమ నాయకుడు పెద్ది సుదర్శన్ రెడ్డి శుక్రవారం తెల్లవారుజామున కన్నుమూశారు. గత వారం రోజులుగా సికింద్రాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్న ఆయన ఆరోగ్య పరిస్థితి విషమించడంతో రాత్రి 12:51 గంటలకు తుదిశ్వాస విడిచినట్లు వైద్యులు తెలిపారు.వారం రోజుల క్రితం గుండెపోటుకు గురైన ఆయనను వరంగల్ నుంచి హైదరాబాద్‌కు తరలించి చికిత్స అందించినప్పటికీ ఫలితం లేకపోయింది. ఆయన మృతితో బీఆర్ఎస్ శ్రేణులు, నర్సంపేట నియోజకవర్గ ప్రజలు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. పలువురు రాజకీయ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# 100 రోజుల్లో రూ.6 వేల కోట్ల బకాయిల చెల్లింపు

- మూడో విడతగా మరో రూ.2 వేల కోట్లు విడుదల
- కమ్యూటేషన్ బకాయిలకు తెర.. ఉద్యోగులకు ఆర్థిక ఊరట



**హైదరాబాద్, జూలై 30 (మన విశ్వం):** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చిన హామీని తెలంగాణ ప్రభుత్వం గడువులోపే అమలు చేసింది. 100 రోజుల్లో రూ.6 వేల కోట్ల బకాయిలను చెల్లిస్తామని ప్రకటించిన ప్రభుత్వం, గురువారం మూడో విడతగా మరో రూ.2 వేల కోట్లను విడుదల చేయడంతో మొత్తం చెల్లింపులు పూర్తయ్యాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా నిధుల విడుదలకు ఉత్తర్వులు జారీ చేశారు.ప్రభుత్వం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం మే 29న తొలి విడతగా రూ.2 వేల కోట్లు, జూన్ 30న రెండో విడతగా మరో రూ.2 వేల కోట్లు విడుదల చేసిం ది. తాజాగా మూడో విడతగా మరో రూ.2 వేల కోట్లు విడు దల చేయడంతో 100 రోజుల లక్ష్యాన్ని విజయవంతంగా పూర్తి చేసింది. ఆర్థిక ఒత్తిళ్లు ఉన్నప్పటికీ ఉద్యోగుల సంక్షేమానికి ప్రభు త్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని అధికార వర్గాలు పేర్కొన్నాయి.

**- కమ్యూటేషన్ బకాయిలకు పూర్తి పరిష్కారం**

తాజాగా విడుదల చేసిన నిధులతో పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న కమ్యూటేషన్ బకాయిలను పూర్తిగా చెల్లించినట్లు ఆర్థిక శాఖ వెల్లడించింది. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఈ సమస్యకు పరిష్కారం లభించడంతో విశ్రాంత ఉద్యోగుల్లో హర్షం వ్యక్తమవుతోంది. మిగిలి ఉన్న ఇతర బకాయిలను కూడా దశలవారీగా విడుదల చేసి పూర్తిగా చెల్లిస్తామని ప్రభుత్వం స్పష్టం చేసింది.

**- ఉద్యోగుల్లో హర్షం**

బకాయిల విడుదలతో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగులు, పెన్షనర్లు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. క్లిష్టమైన ఆర్థిక పరిస్థితుల మధ్య కూడా ప్రభుత్వం ఇచ్చిన హామీని నిర్ణీత గడువులో అమలు చేయడం అభినందనీయమని ఉద్యోగ సంఘాల నాయకులు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, ఉద్యోగుల సంక్షేమానికి ఇదే విధమైన సానుకూల నిర్ణయాలు కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ నిర్ణయంతో ప్రభుత్వం--ఉద్యోగ సంఘాల మధ్య పరస్పర విశ్వాసం మరింత బలోపేతమవుతుందని అభిప్రాయపడ్డారు.

# రాజ్‌నాథ్ సింగ్‌తో ఈటల భేటీ

- అభివృద్ధి అంశాలపై వినతులు సమర్పణ
- కంటోన్మెంట్‌కు అదనపు నిధులు కోరిన ఎంపీ
- డిఫెన్స్ భూముల్లో రహదారుల విస్తరణకు విజ్ఞప్తి
- తెలంగాణ రాజకీయాలపై సుదీర్ఘ చర్చ



**న్యూఢిల్లీ, జూలై 30 (మన విశ్వం ):** మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను గురువారం న్యూఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులతో పాటు తెలంగాణ రాజకీయాలపై ఇరువురు సుదీర్ఘంగా చర్చించినట్లు వెల్లడించారు. తెలంగాణలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలకు కేంద్ర సహకారం అందించాలని ఈటల రాజేందర్ కోరినట్లు సమాచారం. భేటీలో భాగంగా సికింద్రాబాద్ కంటోన్మెంట్ ప్రాంత అభివృద్ధికి అదనపు నిధులు కేటాయించాలని ఈటల రాజేందర్ రక్షణ మంత్రిని కోరారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న ఈ ప్రాంతానికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు కేంద్రం ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. కౌకురు దర్గా నుంచి బిట్స్ పిలాని వరకు డిఫెన్స్ భూముల మీదుగా రహదారి నిర్మాణం, విస్తరణకు అనుమతి ఇవ్వాలని ఈటల రాజేందర్ కోరారు. అలాగే రక్షణ శాఖ పరిధిలోని పలు రహదారుల విస్తరణతో పాటు సామాన్య ప్రజల రాకపోకలకు మరిన్ని మార్గాలను అందుబాటులోకి తీసుకురావాలని కూడా విజ్ఞప్తి చేశారు. రాజ్‌నాథ్ సింగ్ త్వరలో తెలంగాణ పర్యటనకు సంబంధించిన అంశం కూడా సమావేశంలో చర్చకు వచ్చినట్లు ఈటల రాజేందర్ తెలిపారు. రాష్ట్రంలో చేపట్టాల్సిన కార్యక్రమాలు, ప్రజలతో మమేకమయ్యే కార్యాచరణపై ఇరువురు అభిప్రాయాలు పంచుకున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణలో భారతీయ జనతా పార్టీకి అనుకూల పరిస్థితులు ఉన్నాయని, వాటిని సమర్థంగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందని రాజ్‌నాథ్ సింగ్ సూచించినట్లు ఈటల రాజేందర్ తెలిపారు. కేంద్ర నాయకత్వం, రాష్ట్ర నాయకుల సమన్వయంతో పార్టీని మరింత బలోపేతం చేయాలని సమావేశంలో చర్చ జరిగినట్లు వెల్లడించారు. కేంద్ర నాయకత్వం సహకారం, రాష్ట్ర నాయకుల సమిష్టి కృషితో తెలంగాణలో భారతీయ జనతా పార్టీని అధికాంలోకి తీసుకురావడానికి కృషి చేస్తామని ఈటల రాజేందర్ పేర్కొన్నారు. అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు పార్టీ విస్తరణకు అవసరమైన కార్యాచరణను మరింత వేగవంతం చేస్తామని ఆయన తెలిపారు.

# గణేష్ ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు

- విగ్రహ తయారీదారులతో సీపీ సమీక్ష
- 16 అడుగుల ఎత్తుకే విగ్రహాల పరిమితి
- భద్రత, రవాణాపై కీలక ఆదేశాలు
- మట్టి విగ్రహాల వినియోగానికి ప్రోత్సాహం



**హైదరాబాద్, జూలై 30 (మన విశ్వం ):** రాబోయే గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా, సురక్షితంగా, పర్యావరణహితంగా నిర్వహించేందుకు హైదరాబాద్ నగర పోలీసు శాఖ ముందస్తు సన్నాహాలను ముమ్మరం చేసింది. ఇప్పటికే భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులతో సమావేశమైన పోలీసు అధికారులు, గురువారం బంజారాహిల్స్‌లోని టీజీఐసీసీసీ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో విగ్రహ తయారీదారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. నగర పోలీసు కమిషనర్ వీసీ సజ్జనర్ ఈ సమావేశానికి అధ్యక్షత వహించి పలు కీలక సూచనలు చేశారు. విగ్రహాల ప్రతిష్ఠాపన నుంచి శోభాయాత్ర, నిమజ్జనం వరకు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలని సీపీ స్పష్టం చేశారు. గత ఏడాది నగర పోలీసు కమిషనరేట్ పరిధిలో సుమారు 23 వేల గణేష్ విగ్రహాలు ప్రతిష్ఠించగా, రవాణా సమయంలో నాలుగు ప్రమాదాలు జరిగిన విషయాన్ని గుర్తు చేశారు. ఈసారి అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తయారీ దశ నుంచే భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితితో జరిగిన చర్చల మేరకు గణేష్ విగ్రహాల గరిష్ఠ ఎత్తును 16 అడుగులకు పరిమితం చేయాలని సీపీ పేర్కొన్నారు. కళాకారులు మట్టి విగ్రహాల తయారీకి ప్రాధాన్యం ఇవ్వాలని, భక్తులు కూడా సులభంగా నిమజ్జనం చేయగల చిన్న విగ్రహాలను ఎంచుకునేలా అవగాహన కల్పించాలని కోరారు. విగ్రహాల తయారీ కేంద్రాల్లో అగ్నిప్రమాదాలు జరగకుండా అగ్నిమాపక భద్రతా చర్యలు తీసుకోవడంతో పాటు విద్యుత్ వ్యవస్థను సురక్షితంగా నిర్వహించాలని సూచించారు. విగ్రహాల తయారీదారులకు అవసరమైన మౌలిక వసతులను వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయంతో అందించేందుకు నగర పోలీసు శాఖ సహకరిస్తుందని సజ్జనర్ హామీ ఇచ్చారు. ధూల్‌పేట్, జల్‌పల్లి, మైలార్‌దేవ్‌పల్లి వంటి ప్రధాన ప్రాంతాల నుంచి విగ్రహాల రవాణా కోసం ప్రత్యేక ప్రవేశ, నిష్క్రమణ మార్గాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రద్దీ సమయాల్లో భారీ విగ్రహాల రవాణాను పూర్తిగా నివారించాలని, ముందస్తుగా ట్రాఫిక్ పోలీసుల అనుమతి తీసుకోవాలని సూచించారు.

విగ్రహాల కొనుగోలు, రవాణా, మండపాలకు చేరుకునే సమయం, మార్గాల వివరాలను స్థానిక శాంతిభద్రతలు, ట్రాఫిక్ పోలీసులకు తప్పనిసరిగా తెలియజేయాలని సీపీ స్పష్టం చేశారు. భారీ విగ్రహాల తరలింపు సమయంలో విద్యుత్ తీగలు, ఫ్లైఓవర్లు, మెట్రో నిర్మాణాలకు ఆటంకం కలగకుండా ముందస్తు రవాణా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. లోడింగ్, అన్‌లోడింగ్‌కు ఉపయోగించే క్రేన్లు, వాహనాలు ధ్రువీకరణ పొందినవే కావాలని, అనుభవజ్ఞులైన సిబ్బందితోనే నిర్వహించాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో అదనపు పోలీసు కమిషనర్ తఫ్సీర్ ఇక్బాల్, సంయుక్త పోలీసు కమిషనర్ జోయల్ డేవిస్, ట్రాఫిక్ డీసీపీలు కాజల్ సింగ్, రాహుల్ హెగ్డే, గోల్కొండ జోన్ డీసీపీ జె. రాఘవేందర్ రెడ్డి, శంషాబాద్ జోన్ డీసీపీ బి. రాజేష్‌తో పాటు పలువురు అదనపు డీసీపీలు, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఇతర పోలీసు అధికారులు, విగ్రహ తయారీదారులు పాల్గొన్నారు. ఉత్సవాలు ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు అందరూ సమన్వయంతో పనిచేయాలని సీపీ పిలుపునిచ్చారు.

# తెలంగాణ ఆర్కైవ్స్‌కు తాజికిస్తాన్ ఆసక్తి



- అరుదైన ప్రతుల అనువాదానికి సహకార ప్రతిపాదన
- భారత్--తాజికిస్తాన్ సాంస్కృతిక బంధాల బలోపేతానికి ముందడుగు
- అరుదైన చారిత్రక పత్రాలను పరిశీలించిన రాయబారి
- డిజిటలీకరణ పనులపై అధికారుల వివరణ

**హైదరాబాద్, జూలై 30 (మన విశ్వం ):** భారతదేశంలోని తాజికిస్తాన్ రాయబారి బొబోజోంజోదా లుక్మోన్ గురువారం తెలంగాణ రాష్ట్ర ఆర్కైవ్స్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ భద్రపరిచిన అరుదైన ప్రతులు, చారిత్రక పత్రాల విశాల సేకరణను పరిశీలించి ప్రశంసించారు. చారిత్రక వారసత్వాన్ని సంరక్షించడంలో తెలంగాణ రాష్ట్ర ఆర్కైవ్స్ చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు. సందర్శన సందర్భంగా భారత్--తాజికిస్తాన్ సాంస్కృతిక మార్పిడి కార్యక్రమంలో భాగంగా తెలంగాణ రాష్ట్ర ఆర్కైవ్స్‌తో కలిసి అరుదైన ప్రతుల అనువాదం, లిప్యంతరీకరణ, ప్రచురణ కోసం తెలంగాణ ప్రభుత్వానికి తాజికిస్తాన్ ప్రభుత్వం ప్రతిపాదన సమర్పించనున్నట్లు రాయబారి తెలిపారు. ఈ సహకారం ద్వారా ఇరు దేశాల మధ్య సాంస్కృతిక, విద్యా సంబంధాలు మరింత బలోపేతం అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.తెలంగాణ రాష్ట్ర ఆర్కైవ్స్‌లో భద్రపరిచిన అరుదైన ప్రతులను తాజిక్ భాషలోకి అనువదిస్తే తమ దేశ ప్రజలకు భారత జ్ఞాన సంపదను మరింత దగ్గర చేయగలమని రాయబారి పేర్కొన్నారు. జ్ఞానం, విజ్ఞానానికి నిలయమైన భారతదేశ చారిత్రక వారసత్వాన్ని తాజికిస్తాన్ ప్రజలకు పరిచయం చేయడంలో ఈ కార్యక్రమం కీలకంగా మారుతుందని అభిప్రాయపడ్డారు. తెలంగాణ రాష్ట్ర ఆర్కైవ్స్ సంచాలకురాలు జరీనా పర్వీన్ షికాస్తా పర్షియన్ భాషలోని అరుదైన ఒక చారిత్రక ప్రతిని చదివి దాని విశేషాలను రాయబారికి వివరించారు. ఇటువంటి అరుదైన చారిత్రక పత్రాలను అర్థం చేసుకోవడానికి ప్రత్యేక నైపుణ్యం అవసరమని ఆమె వివరించారు. ఈ సందర్భంగా అక్కడ భద్రపరిచిన పలు విలువైన చారిత్రక రికార్డులను కూడా రాయబారి పరిశీలించారు.భారత్, తాజికిస్తాన్ దేశాల మధ్య శతాబ్దాల నాటి సాంస్కృతిక, ఆధ్యాత్మిక, నాగరికత సంబంధాలు ఉన్నాయని రాయబారి పేర్కొన్నారు. విద్య, జ్ఞానం, సంస్కృతి రంగాల్లో సహకారం మరింత పెరిగితే రెండు దేశాలకే కాకుండా మధ్య ఆసియా ప్రాంతంలో శాంతి, అభివృద్ధికి కూడా దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం భూగోళ శాస్త్ర విభాగం ఆచార్యుడు అక్తర్ అలీ రాయబారితో కలిసి పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆర్కైవ్స్ సహాయ సంచాలకుడు ఎం.ఏ. రకీబ్ రాయబారికి స్వాగతం పలికి, ఆర్కైవ్స్‌లో కొనసాగుతున్న డిజిటలీకరణ కార్యక్రమంపై వివరించారు. సహాయ సంచాలకులు సంధ్యారాణి, జి. శ్రీకాంత్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# వందేమాతరం బిల్లుపై ఒవైసీ విమర్శలు

- రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని ఆరోపణ
- మత స్వేచ్ఛపై ప్రభావం చూపుతుందని వ్యాఖ్యలు
- జనగణమన, వందేమాతరంపై భిన్న అభిప్రాయాలు
- చట్టాన్ని వ్యతిరేకించిన హైదరాబాద్ ఎంపీ



**న్యూఢిల్లీ, జూలై 30 (మన విశ్వం ):** పార్లమెంట్ ఉభయ సభల ఆమోదం పొందిన వందేమాతరం బిల్లుపై ఎంఐఎం అధినేత, హైదరాబాద్ లోక్‌సభ సభ్యుడు అసదుద్దీన్ ఒవైసీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. పార్లమెంట్ సమావేశాలు ముగిసిన అనంతరం విలేకరులతో మాట్లాడిన ఆయన, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ చట్టం దేశ రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఉందని ఆరోపించారు. బిల్లుపై తమ పార్టీ అభ్యంతరాలను స్పష్టంగా వెల్లడించారు. జాతీయ గీతం 'జనగణమన', జాతీయ గేయంగా పరిగణిస్తున్న 'వందేమాతరం' మధ్య ఉన్న తేడాను కూడా ఒవైసీ ప్రస్తావించారు. 'జనగణమన' దేశ వైవిధ్యం, ఐక్యతను ప్రతిబింబిస్తుందని, అయితే 'వందేమాతరం' ఒక నిర్దిష్ట పూజా విధానం, దేవతారాధనకు సంబంధించిన భావాలను కలిగి ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కారణంగా రెండింటినీ ఒకే కోణంలో చూడలేమని పేర్కొన్నారు. 1950 నాటి పరిణామాలను ప్రస్తావించిన ఒవైసీ, అప్పటి రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ పార్లమెంటులో ప్రత్యేక తీర్మానం లేకుండానే వందేమాతరానికి జాతీయ గేయ హోదా ప్రకటించారని అన్నారు. భారత రాజ్యాంగంలో గానీ, ప్రస్తుత చట్టాల్లో గానీ 'జాతీయ గేయం' అనే పదానికి స్పష్టమైన నిర్వచనం లేదని ఆయన వ్యాఖ్యానించారు. ప్రస్తుత సవరణ చట్టం రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను ప్రభావితం చేస్తోందని ఒవైసీ ఆరోపించారు. ముఖ్యంగా ఆర్టికల్ 25, 26, 29 కింద పౌరులకు లభించే మత స్వేచ్ఛ, సాంస్కృతిక హక్కులపై ఈ చట్టం ప్రతికూల ప్రభావం చూపుతుందని ఆయన అన్నారు. ఈ అంశాలను ప్రభుత్వం పునఃపరిశీలించాలని కోరారు.పార్లమెంట్‌లో ఈ బిల్లుపై అధికార, ప్రతిపక్షాల మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. కేంద్ర ప్రభుత్వం జాతీయ గేయానికి చట్టబద్ధ రక్షణ కల్పించడమే ఈ బిల్లు ఉద్దేశమని స్పష్టం చేస్తుండగా, కొన్ని ప్రతిపక్ష పార్టీలు రాజ్యాంగ, మత స్వేచ్ఛల పరిరక్షణ కోణంలో అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయి. అసదుద్దీన్ ఒవైసీ చేసిన వ్యాఖ్యలు ఆయన వ్యక్తిగత, పార్టీ అభిప్రాయాలే. వందేమాతరం బిల్లుకు ఇప్పటికే పార్లమెంట్ ఉభయ సభలు ఆమోదం తెలిపాయి. ఈ అంశంపై రాజకీయ పార్టీల మధ్య భిన్నాభిప్రాయాలు కొనసాగుతున్న నేపథ్యంలో చట్టంపై చర్చ మరింత ముదురుతోంది.

# భారతీనగర్‌లో కమిషనర్ పర్యటన

- 'రోజుకు ఒక వార్డు' కార్యక్రమం కొనసాగింపు
- పౌర సమస్యలపై నివాస సంఘాలతో సమావేశం
- రోడ్లు, పారిశుద్ధ్యంపై ప్రత్యేక సమీక్ష
- పనులు వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశాలు




**హైదరాబాద్, జూలై 30 (మన విశ్వం ):** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ చేపట్టిన 'రోజుకు ఒక వార్డు' కార్యక్రమంలో భాగంగా కమిషనర్ భారతీనగర్ వార్డును సందర్శించారు. అమీన్‌పూర్ సర్కిల్ పరిధిలోని ఈ వార్డులో జోనల్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్, వివిధ విభాగాల అధికారులు పాల్గొని నివాస సంక్షేమ సంఘాల ప్రతినిధు లతో సమావేశమై పౌర సమస్యలు, అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో సిమెంట్, తారు రహదారుల నిర్మాణం, భూగర్భ మురుగునీటి పైపుల మరమ్మతులు, నివాస కాలనీల్లో చెట్ల కొమ్మల తొలగింపు, చెత్త సేకరణ, పారిశుద్ధ్య నిర్వహణ వంటి అంశాలపై స్థానికులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. అదేవిధంగా పార్కుల అభివృద్ధి, నిర్వహణ, బహిరంగ వ్యాయామ పరికరాలు, చిన్నారుల ఆట వస్తువుల ఏర్పాటు, ప్రహరీ గోడల నిర్మాణం, వర్షపు నీటి కాలువల మరమ్మతులు, ప్రజా మరుగుదొడ్ల నిర్వహణ వంటి అంశాలపై కూడా చర్చ జరిగింది. పాఠశాలలు, కార్యాలయాల సమయాల్లో ట్రాఫిక్ రద్దీ నివారణకు చర్యలు తీసుకోవాలని నివాస సంఘాల ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు.

వీధి దీపాల నిర్వహణ, మురుగునీటి బయటకు వెళ్లే మార్గాల సమస్యలను కూడా అధికారులు సమీక్షించారు. సంబంధిత శాఖలు ప్రతి సమస్యను క్షుణ్ణంగా పరిశీలించి తగిన చర్యలు చేపట్టాలని కమిషనర్ ఆదేశించారు. ఇంజినీరింగ్ పనులకు అర్హత ఉన్న ప్రతిపాదనలకు అంచనాలు సిద్ధం చేయాలని సూచించారు. ఇతర సమస్యలను సంబంధిత శాఖలకు పంపించి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు. ప్రజలతో ప్రత్యక్షంగా మమేకమై సమస్యలను తెలుసుకుని పరిష్కరించడమే 'రోజుకు ఒక వార్డు' కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు.

# అటవీ అనుభవాల గ్రంథావిష్కరణ

- రాజ్‌భవన్‌లో గవర్నర్ చేతుల మీదుగా ఆవిష్కరణ
- అటవీ సంరక్షణపై పుస్తకంలో అనుభవాల సమాహారం
- జీవవైవిధ్య పరిరక్షణకు అధిక ప్రాధాన్యం అవసరం
- పౌర సేవల అభ్యర్థులకు ఉపయోగపడే గ్రంథమని అభిప్రాయం




**హైదరాబాద్, జూలై 30 (మన విశ్వం ):** తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా గురువారం లోక్‌భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో భారత అటవీ సేవ విశ్రాంత అధికారి, తెలంగాణ మాజీ ప్రధాన ప్రధాన అటవీ సంరక్షణాధికారి, అటవీ దళాధిపతి పరేశ్ కుమార్ శర్మ రచించిన ఫుట్‌ప్రింట్స్ ఇన్ ది ఫారెస్ట్స్ -- మెమోయిర్స్ ఆఫ్ ఎ ఫారెస్టర్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రచయితను గవర్నర్ అభినందించి, ఆయన సేవలను ప్రశంసించారు. భారత అటవీ సేవలో మూడు దశాబ్దాలకు పైగా పనిచేసిన అనుభవాలను ఈ గ్రంథంలో పొందుపరిచినట్లు తెలిపారు. అటవీ పరిరక్షణ, పరిపాలనా అనుభవాలు, ప్రకృతి సంరక్షణలో ఎదురైన సవాళ్లు, వాటి పరిష్కారాలపై ఈ పుస్తకంలో సమగ్రంగా వివరించినట్లు పేర్కొన్నారు. విధుల్లో ఉన్న అధికారులు, పౌర సేవలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు, అటవీ అధికారులు, ప్రకృతి ప్రేమికులు, విద్యార్థులకు ఈ గ్రంథం ఉపయోగకరంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు.ఈ సందర్భంగా పరేశ్ కుమార్ శర్మ మాట్లాడుతూ జాతీయ అటవీ విధానం, వాతావరణ మార్పులపై భారత్ తీసుకున్న కట్టుబాట్లకు అనుగుణంగా అటవీ సంపద, జీవవైవిధ్య పరిరక్షణకు మరింత ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు అటవీ రంగంలో పెట్టుబడులు పెంచాల్సిన అవసరం ఉందని సూచించారు. భవిష్యత్ తరాలకు సుస్థిరమైన పర్యావరణాన్ని అందించాలంటే అటవీ విస్తీర్ణం పెంపు, జీవవైవిధ్య పరిరక్షణ, ప్రకృతి వనరుల సంరక్షణపై ప్రభుత్వాలు, సమాజం కలిసికట్టుగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. అటవీ రంగంలో ఆధునిక సాంకేతికత వినియోగంతో పాటు ప్రజల భాగస్వామ్యం కూడా కీలకమని పేర్కొన్నారు.గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా మాట్లాడుతూ ప్రకృతి సంపదను కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. అటవీ సంపద, పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించడంలో ఇటువంటి గ్రంథాలు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని తెలిపారు. యువతలో ప్రకృతి పట్ల బాధ్యత పెంచేందుకు ఇలాంటి రచనలు ప్రేరణగా నిలుస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఆర్‌ఏఎస్ పబ్లిష్ ప్రతినిధి సుప్రియా భాలే రావు, విశ్రాంత భారత అటవీ సేవ అధికారి డాక్టర్ మనోరంజన్ భంజా, మనోవిజ్ఞాన సలహాదారు నేహా వ్యాస్‌తో పాటు పలువురు అధికారులు, ఆహ్వానితులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం పుస్తక రచయితతో గవర్నర్ కొద్దిసేపు ముచ్చటించి శుభాకాంక్షలు తెలిపారు.

శుక్రవారం ,
జూలై 31, 2026
మన విశ్వం
VOICE OF THE PEOPLE-POWER OF TRUTH
తెలుగు వార్తా దినపత్రిక



# వర్షాల వేళ హైడ్రా అప్రమత్తం

- 24 గంటలూ సహాయక బృందాల విధులు
- వరద, నీటిముంపు ప్రాంతాల్లో వేగవంతమైన స్పందన
- అన్ని శాఖలతో సమన్వయంగా సహాయక చర్యలు
- అత్యవసర సేవలకు ప్రత్యేక నియంత్రణ కేంద్రం




**హైదరాబాద్, జూలై 30 (మన విశ్వం ):** నగరంలో కొనసాగుతున్న వర్షాల నేపథ్యంలో హైడ్రా విపత్తు స్పందన దళాలు, ప్రత్యేక వర్షాకాల స్పందన బృందాలు ఇరవై నాలుగు గంటలూ అప్రమత్తంగా విధులు నిర్వహిస్తున్నాయి. వర్షాల వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తున్నట్లు హైడ్రా వెల్లడించింది. నగర ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యంగా అన్ని ప్రాంతాల్లో ప్రత్యేక బృందాలను సిద్ధంగా ఉంచినట్లు తెలిపింది. వర్షాల కారణంగా నీరు నిలిచే ప్రాంతాలు, పట్టణ వరదలు, రహదారులపై పడిపోయిన చెట్లు, పొంగిపొర్లుతున్న కాలువలు, అత్యవసర సహాయక చర్యలు వంటి ప్రతి అంశంపై హైడ్రా బృందాలు వెంటనే స్పందిస్తున్నాయి. పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ సమస్యలు తలెత్తిన వెంటనే క్షేత్రస్థాయికి చేరుకుని పరిష్కార చర్యలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు.

వర్షాకాలంలో అత్యవసర పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు జలమండలి, విద్యుత్, జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ పోలీసులు, అగ్నిమాపక శాఖ తదితర సంబంధిత శాఖలతో సమన్వయంగా పనిచేస్తున్నట్లు హైడ్రా వెల్లడించింది. ప్రజలకు ఇబ్బందులు తగ్గించేందుకు అన్ని శాఖలు పరస్పర సహకారంతో వేగంగా స్పందిస్తున్నాయని పేర్కొంది. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు వెంటనే స్పందన పొందేందుకు ప్రత్యేక నియంత్రణ కేంద్రాన్ని ఇరవై నాలుగు గంటలూ అందుబాటులో ఉంచినట్లు హైడ్రా తెలిపింది. వరదలు, నీటిముంపులు లేదా ఇతర అత్యవసర పరిస్థితులు ఎదురైతే ప్రజలు టోల్‌ఫ్రీ అత్యవసర సేవల సంఖ్య 1070కు లేదా హైడ్రా నియంత్రణ కేంద్రం ఫోన్ నంబర్లు 9000113667, 8712406901, 7337218171లకు సమాచారం అందించాలని కోరింది.ప్రజలు అవసరం లేకుండా వరద ప్రభావిత ప్రాంతాల్లోకి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, నీరు నిలిచిన రహదారులపై అప్రమత్తంగా ప్రయాణించాలని అధికారులు సూచించారు. ప్రమాదకర పరిస్థితులు కనిపిస్తే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల సహకారంతోనే వర్షాకాల అత్యవసర పరిస్థితులను సమర్థంగా ఎదుర్కోవచ్చని పేర్కొన్నారు. వర్షాకాలం ముగిసే వరకు హైడ్రా విపత్తు స్పందన దళాలు, ప్రత్యేక వర్షాకాల బృందాలు పూర్తిస్థాయిలో అప్రమత్తంగా పనిచేస్తాయని అధికారులు స్పష్టం చేశారు. నగర ప్రజల ప్రాణ, ఆస్తుల రక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ వేగవంతమైన సహాయక చర్యలను కొనసాగిస్తామని, ఎలాంటి అత్యవసర పరిస్థితినైనా సమర్థంగా ఎదుర్కొనేందుకు యంత్రాంగం పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉందని వెల్లడించారు.

# ఎగుమతుల వృద్ధికి కార్యాచరణ ప్రణాళిక



- రాష్ట్ర ఎగుమతుల ప్రోత్సాహ కమిటీ సమావేశం
- ఎగుమతులకు అనుకూల విధానాలపై దృష్టి
పలు రంగాల ఎగుమతుల విస్తరణకు చర్యలు
- దేశంలో అగ్ర ఎగుమతి కేంద్రంగా తెలంగాణ :ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు

**హైదరాబాద్, జూలై 30 (మన విశ్వం ):** తెలంగాణ రాష్ట్ర ఎగుమతులను మరింత వేగవంతం చేసేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో గురువారం నిర్వహించిన రాష్ట్ర ఎగుమతుల ప్రోత్సాహ కమిటీ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి ఎగుమతుల పెంపు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, కొత్త మార్కెట్ల అన్వేషణ వంటి అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ఎగుమతులకు అనుకూలమైన విధానాల రూపకల్పనతో పాటు మౌలిక సదుపాయాల బలోపేతం, అంతర్జాతీయ మార్కెట్లలో తెలంగాణ ఉత్పత్తులకు మరింత ప్రాధాన్యం కల్పించే చర్యలపై విస్తృతంగా చర్చించారు. తయారీ రంగం, వ్యవసాయం, ఆహార ప్రాసెసింగ్, ఔషధ పరిశ్రమ, హస్తకళలు, సమాచార సాంకేతిక సేవలు వంటి కీలక రంగాల్లో ఎగుమతులను విస్తరించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ప్రధాన కార్యదర్శి సూచించారు.గత ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ నుంచి రూ.1.22 లక్షల కోట్ల విలువైన ఎగుమతులు నమోదైనట్లు అధికారులు సమావేశంలో వివరించారు. ఈ ప్రగతిని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు రంగాల వారీగా లక్ష్యాలను నిర్దేశించి, ఎగుమతిదారులకు అవసరమైన అన్ని విధాల సహాయ సహకారాలు అందించాలని ప్రధాన కార్యదర్శి ఆదేశించారు. విదేశీ వాణిజ్య ప్రధాన సంచాలక కార్యాలయంతో సమన్వయాన్ని మరింత బలోపేతం చేయాలని సంజయ్ జాజు సూచించారు. ఎగుమతుల ప్రక్రియలో ఎదురయ్యే సమస్యలను వేగంగా పరిష్కరించి, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా రాష్ట్ర ఉత్పత్తుల పోటీతత్వాన్ని పెంచే చర్యలు తీసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఎగుమతుల విస్తరణ ద్వారా రాష్ట్ర ఆర్థికాభివృద్ధితో పాటు ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని సమావేశంలో అభిప్రాయం వ్యక్తమైంది. చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు ఎగుమతుల రంగంలో మరింత ప్రోత్సాహం అందించి కొత్త మార్కెట్లలో అవకాశాలను సద్వినియోగం చేసుకునేలా సహకారం అందించాలని అధికారులు సూచించారు. తెలంగాణను దేశంలోనే ప్రముఖ ఎగుమతి కేంద్రంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ప్రభుత్వం కార్యాచరణ చేపడుతోందని ప్రధాన కార్యదర్శి పేర్కొన్నారు. ప్రభుత్వ శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ఎగుమతుల వృద్ధికి అవసరమైన అన్ని చర్యలను వేగవంతం చేయాలని, రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి ఎగుమతుల రంగాన్ని కీలక శక్తిగా తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు.

# అంగన్వాడీలకు మౌలిక వసతులు

- వంద శాతం సౌకర్యాల కల్పనకు ఆదేశాలు
- చిన్నారులకు పాలు, అల్పాహారం అమలు వేగవంతం
- టీచర్లు, ఆయాలతో జిల్లా వారీగా సదస్సులు
- బాలల సంక్షేమానికి సమగ్ర కార్యాచరణపై దృష్టి
- మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క



**హైదరాబాద్, జూలై30(మన విశ్వం ):** రాష్ట్రంలోని అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క తెలిపారు. గత ఏడాది కాలంలోనే అదనంగా 5,938 అంగన్వాడీ కేంద్రాలకు మరుగుదొడ్లు, 3,815 కేంద్రాలకు తాగునీటి సౌకర్యం, 14,271 కేంద్రాలకు విద్యుత్ సదుపాయం కల్పించిన అధికారులను మంత్రి అభినందించారు. రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన శాఖ సమీక్ష సమావేశంలో శాఖ కార్యదర్శి శృతి ఓజా, జాయింట్ డైరెక్టర్ మోతి తదితర అధికారులతో కలిసి పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలోని ప్రతి అంగన్వాడీ కేంద్రంలో వంద శాతం మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుత్ సదుపాయాలు అందుబాటులోకి తీసుకురావాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఇంకా పూర్తికాని మౌలిక వసతుల పనులను ఎలాంటి జాప్యం లేకుండా పూర్తి చేయాలని సూచించారు. టాయిలెట్లు, తాగునీరు, విద్యుత్ పనులు జరుగుతున్న ప్రాంతాల్లో సంబంధిత ఇంజినీరింగ్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని, ప్రతి కేంద్రంలో ఏ పనులు పూర్తయ్యాయి, ఇంకా ఏవి పెండింగ్‌లో ఉన్నాయనే వివరాలను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.

అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అందుతున్న పోషకాహారం, వారి శారీరక ఎదుగుదలపై నమూనా సర్వే నిర్వహించాలని మంత్రి సీతక్క సూచించారు. ఆ సర్వే ఫలితాల ఆధారంగా పోషకాహార కార్యక్రమాలను మరింత మెరుగుపరచాలని తెలిపారు. చిన్నారులకు పాలు, అల్పాహారం అందించే కార్యక్రమాన్ని రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఆలస్యం లేకుండా అమలు చేయాలని స్పష్టం చేశారు. ప్రతి చిన్నారికి నాణ్యమైన పోషకాహారం అందేలా చర్యలు తీసుకోవాలని, ఉదయం అల్పాహారం వారి శారీరక, మానసిక వికాసానికి దోహదపడేలా ఉండాలని పేర్కొన్నారు. అంగన్వాడీ వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి జిల్లా వారీగా అంగన్వాడీ టీచర్లు, ఆయాలతో ప్రత్యేక సదస్సులు నిర్వహించాలని మంత్రి ఆదేశించారు. క్షేత్రస్థాయిలో వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కార్యాచరణ రూపొందించాలని సూచించారు. టీచర్లు, ఆయాల ఖాళీల భర్తీ ప్రక్రియను వేగవంతం చేయాలని, 16 జిల్లాల్లో ఇప్పటికే నోటిఫికేషన్లు జారీ అయ్యాయని, మిగిలిన జిల్లాల్లో కూడా నియామక ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అక్టోబర్ తొలి వారంలోగా యూనిఫాంల పంపిణీ పూర్తి చేయడంతో పాటు అంగన్వాడీ టీచర్లకు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా డిప్లొమా సర్టిఫికెట్లు అందించే ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు.

అంగన్వాడీ కేంద్రాలు చిన్నారులను ఆకర్షించేలా ఆహ్లాదకరమైన వాతావరణంతో ఉండాలని మంత్రి తెలిపారు. పిల్లలకు ఉత్సాహాన్ని కలిగించే రంగులతో కేంద్రాలను తీర్చిదిద్దాలని, అభ్యాసం, ఆటపాటలు, ఆరోగ్య సంరక్షణకు అనువైన వాతావరణం కల్పించాలని సూచించారు. వర్షాల సమయంలో అవసరమైతే అంగన్వాడీ కేంద్రాలను తాత్కాలికంగా సురక్షిత ప్రాంతాలకు మార్చి చిన్నారుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. బస్టాండ్లు వంటి రద్దీ ప్రాంతాల్లో తల్లులు పిల్లలకు పాలిచ్చేందుకు ఇప్పటికే ఏర్పాటు చేసిన 54 తల్లి ఒడి కేంద్రాల తరహాలో అవసరమైన ప్రాంతాల్లో మరిన్ని కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి జిల్లాలో దత్తత కేంద్రాల ఏర్పాటును వేగవంతం చేయాలని, ప్రస్తుతం ఉన్న 17 కేంద్రాలను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని మంత్రి సీతక్క ఆదేశించారు. తెలంగాణను బాల్య వివాహాల రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు గ్రామస్థాయి నుంచి విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కేంద్రం నుంచి వచ్చే నిధులు లాప్స్ కాకుండా పూర్తిస్థాయిలో వినియోగించాలని, కేంద్ర--రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. జిల్లా సంక్షేమ అధికారులు హాస్టళ్లు, అంగన్వాడీ కేంద్రాలను క్రమం తప్పకుండా సందర్శించి సమస్యలపై నివేదికలు సమర్పించాలని మంత్రి ఆదేశించారు.

# కరీంనగర్‌కు మెట్రో ఎక్స్‌ప్రెస్ సేవలు

- మూడు మార్గాల్లో కొత్త సిటీ బస్సుల ప్రారంభం
- ప్రజా రవాణా విస్తరణకు ప్రభుత్వం చర్యలు
- బస్సులో ప్రయాణించి సేవలను పరిశీలించిన మంత్రి
- ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలే లక్ష్యం



**కరీంనగర్, జూలై 30 (మన విశ్వం ):** కరీంనగర్ నగర ప్రజలకు మరింత మెరుగైన ప్రజా రవాణా సేవలు అందించాలనే లక్ష్యంతో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ బస్‌స్టేషన్‌లో సిటీ మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సు సేవలను రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. తొలి దశలో మూడు ప్రధాన మార్గాల్లో ఈ బస్సు సేవలను అందుబాటులోకి తీసుకొచ్చారు. అనంతరం మంత్రి కరీంనగర్ బస్‌స్టేషన్ నుంచి వాగేశ్వరి కళాశాల వరకు సిటీ బస్సులో ప్రయాణించి ప్రయాణికులతో ముచ్చటిస్తూ సేవలను పరిశీలించారు. మొదటి దశలో కరీంనగర్--వాగేశ్వరి కళాశాల, కరీంనగర్--చింతకుంట, కరీంనగర్--కొత్తపల్లి హవేలీ మార్గాల్లో సిటీ మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సులు నడపనున్నట్లు మంత్రి తెలిపారు. నగర శివారు ప్రాంతాల ప్రజలకు వేగవంతమైన, సౌకర్యవంతమైన ప్రజా రవాణా అందించడమే ఈ సేవల ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. విద్యార్థులు, ఉద్యోగులు, రోజువారీ ప్రయాణికులకు ఈ బస్సులు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రజా రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా చర్యలు చేపడుతోందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా కొత్త మార్గాల్లో బస్సు సేవలను విస్తరిస్తూ, సౌకర్యవంతమైన రవాణా అందించేందుకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కృషి చేస్తోందన్నారు. నగరాల్లో పెరుగుతున్న ప్రయాణ అవసరాలను దృష్టిలో ఉంచుకుని మరిన్ని ఆధునిక సేవలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు పేర్కొన్నారు. బస్సులో ప్రయాణించిన సందర్భంగా ప్రయాణికులతో మంత్రి నేరుగా మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. బస్సు సేవల నాణ్యత, సమయపాలన, సౌకర్యాలపై ప్రజల సూచనలు స్వీకరించారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా రవాణా సేవలు అందించేందుకు అవసరమైన మార్పులు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు.

ఈ కొత్త సేవలతో కరీంనగర్ నగరంలో ప్రజా రవాణాపై ఆధారపడే ప్రయాణికులకు మరింత సౌలభ్యం కలుగుతుందని అధికారులు తెలిపారు. నగరంలోని ప్రధాన విద్యాసంస్థలు, నివాస ప్రాంతాలు, వాణిజ్య కేంద్రాలను అనుసంధానించేలా మార్గాలను రూపొందించడం వల్ల రాకపోకలు మరింత సులభతరం అవుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ నాగిరెడ్డి, మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, రవాణా ప్రాధికార సంస్థ సభ్యుడు పడాల రాహుల్, కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు అంజన్ కుమార్, జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్, మున్సిపల్ కమిషనర్, ప్రాంతీయ మేనేజర్, డిపో మేనేజర్, ఆర్టీసీ అధికారులు, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సూపర్ ఎల్‌నినోపై అప్రమత్తం

- రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన
- తాగునీటి సంరక్షణకు ప్రత్యేక ప్రణాళిక
- అన్ని శాఖల సమన్వయంతో చర్యలు
- జిల్లా యంత్రాంగానికి మంత్రి కీలక ఆదేశాలు




**రాజన్న సిరిసిల్ల, జూలై 30 (మన విశ్వం ):** సూపర్ ఎల్‌నినో ప్రభావంపై రైతులు, ప్రజలను ముందుగానే అప్రమత్తం చేయాలని జిల్లా ఇంచార్జి మంత్రి, మార్కెటింగ్, వ్యవసాయ, చేనేత జౌళి, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, ఎస్పీ మహేష్ బి. గితేతో కలిసి మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా యంత్రాంగం రూపొందించిన సూపర్ ఎల్‌నినో కార్యాచరణ ప్రణాళికను అధికారులు ప్రజెంటేషన్ ద్వారా వివరించగా, తెలంగాణ జలసిరి పేరుతో రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో జిల్లా పరిధిలోని రిజర్వాయర్లలో నీటి నిల్వలు, వివిధ పంటల సాగు విస్తీర్ణం, మిషన్ భగీరథ ద్వారా తాగునీటి సరఫరా, విద్యుత్ పరిస్థితులు తదితర అంశాలపై మంత్రి సమీక్ష నిర్వహించారు. సూపర్ ఎల్‌నినో ప్రభావం దక్షిణ భారతదేశంపై అధికంగా ఉండే అవకాశం ఉన్నందున రిజర్వాయర్లలో ప్రస్తుతం ఉన్న నీటిని వచ్చే ఏడాది జూలై వరకు ప్రధానంగా తాగునీటి అవసరాలకే వినియోగించేలా సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయాలని మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. ఇటీవల కురిసిన వర్షాలు పంటలకు కొంత మేలు చేసినప్పటికీ పూర్తిస్థాయిలో సరిపోవని, నీటి వినియోగంలో అత్యంత జాగ్రత్త అవసరమని సూచించారు.గత రెండు నెలలుగా తగిన వర్షాలు లేకపోవడంతో సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గిందని మంత్రి పేర్కొన్నారు. రైతులకు ఆరుతడి, స్వల్పకాలిక పంటలు, పప్పుధాన్యాలు, ఆయిల్‌పామ్ వంటి ప్రత్యామ్నాయ పంటల సాగుపై విస్తృతంగా అవగాహన కల్పించాలని వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులను ఆదేశించారు. అవసరమైన నాణ్యమైన విత్తనాలు రైతులకు అందుబాటులో ఉండేలా చూడాలని, అధికారులు క్షేత్రస్థాయిలోకి వెళ్లి రైతులకు ప్రత్యక్షంగా సలహాలు అందించాలని స్పష్టం చేశారు. నానో యూరియా వినియోగంపై కూడా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. భూగర్భ జలాలు గత ఏడాదితో పోలిస్తే రెండు మీటర్లకు పైగా తగ్గిపోయాయని పేర్కొన్న మంత్రి, జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీల పరిధిలో ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతల నిర్మాణాన్ని ప్రోత్సహించాలని ఆదేశించారు. తెలంగాణ జలసిరి కార్యక్రమం కింద బోర్‌వెల్ రీఛార్జ్ పనులు, ఫార్మ్ పాండ్ల నిర్మాణం వేగవంతం చేయాలని, ప్రతి ప్రభుత్వ కార్యాలయం, పాఠశాల ప్రాంగణంలో కూడా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని సూచించారు. మిషన్ భగీరథ ద్వారా తాగునీటి సరఫరాకు అవసరమైన మోటార్లు, పరికరాలు ముందుగానే సిద్ధంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు.ఎరువుల కొరతపై అసత్య ప్రచారం జరగకుండా చర్యలు తీసుకోవాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. సూపర్ ఎల్‌నినో ప్రభావాన్ని అధిగమించేందుకు ముందస్తు ప్రణాళికతో జిల్లా యంత్రాంగం పనిచేయాలని, ప్రతి శాఖ తన బాధ్యతలను సమర్థంగా నిర్వహించాలని ఆదేశించారు. పోలీసు శాఖ శాంతిభద్రతలతో పాటు పరిస్థితులపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం, పంటల మార్పిడిపై రైతులకు ఇప్పటికే విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత ఏడాది జిల్లాలో 1.85 లక్షల ఎకరాల్లో సాగు జరగగా, ఈ ఏడాది ఇప్పటివరకు 78 వేల ఎకరాల్లో మాత్రమే సాగు జరిగిందన్నారు. రైతు భరోసా పొందుతున్న రైతులందరికీ ప్రత్యామ్నాయ పంటల సాగుపై మొబైల్ సందేశాలు పంపుతున్నామని, ఆగస్టులో సాగు చేయాల్సిన పంటలపై ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. జిల్లాకు 1,500 ఎకరాల ఆయిల్‌పామ్ లక్ష్యం ఉండగా ఇప్పటికే 400 ఎకరాల్లో సాగు పూర్తైందని, తెలంగాణ జలసిరి కింద నీటి సంరక్షణ పనులు పకడ్బందీగా కొనసాగుతున్నాయని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, డీఆర్ఓ జయశ్రీ, వేములవాడ ఆర్డీఓ కేఎస్‌బీ కుమారి, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, సీపీఓ శ్రీనివాసాచారి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# వర్షాల్లో రహదారి భద్రతపై తెలంగాణ పోలీసుల సూచనలు

- వాహనదారులకు జాగ్రత్తలు పాటించాలని విజ్ఞప్తి
- వేగ నియంత్రణతో ప్రమాదాలను నివారించండి
- మొబైల్ వినియోగానికి దూరంగా ఉండాలని సూచన
- ప్రజల భద్రతే పోలీసుల ప్రధాన లక్ష్యం

**హైదరాబాద్, జూలై 30 (మన విశ్వం ):** రాష్ట్రంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో రహదారులపై ప్రయాణించే వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ పోలీసులు సూచించారు. వర్షాల కారణంగా రహదారులు జారుడుగా మారడంతో ప్రమాదాల ముప్పు పెరిగే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని కోరారు. చిన్నపాటి నిర్లక్ష్యం కూడా తీవ్రమైన ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని హెచ్చరించారు. వర్షంలో వాహనాలను అధిక వేగంతో నడపకుండా వేగాన్ని నియంత్రించాలని పోలీసులు సూచించారు. ముందు వెళ్తున్న వాహనంతో తగినంత దూరం పాటించడం ద్వారా ఆకస్మిక ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. రహదారిపై నీరు నిలిచిన ప్రాంతాల్లో మరింత జాగ్రత్తగా ప్రయాణించాలని, తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని సూచించారు.వర్షపు సమయంలో వాహనాల ముందు దీపాలను తప్పనిసరిగా వెలిగించాలని పోలీసులు పేర్కొన్నారు. దీని వల్ల ఎదురుగా వచ్చే వాహనాలకు స్పష్టంగా కనిపించడంతో పాటు ప్రమాదాలను తగ్గించవచ్చని తెలిపారు. అలాగే వాహనాల టైర్లు మంచి స్థితిలో ఉన్నాయో లేదో ముందుగానే తనిఖీ చేసుకోవాలని, పాడైపోయిన లేదా అరిగిన టైర్లతో ప్రయాణించడం ప్రమాదకరమని హెచ్చరించారు. తడి రహదారులపై ఆకస్మికంగా బ్రేకులు వేయడం లేదా హఠాత్తుగా మలుపులు తిరగడం వల్ల వాహనం అదుపు తప్పే ప్రమాదం ఉందని పోలీసులు సూచించారు. అందువల్ల నెమ్మదిగా, నియంత్రణతో వాహనం నడపాలని తెలిపారు. ముఖ్యంగా వర్షపు సమయంలో రహదారిపై నీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.వాహనం నడుపుతున్న సమయంలో మొబైల్ ఫోన్ వినియోగాన్ని పూర్తిగా నివారించాలని తెలంగాణ పోలీసులు విజ్ఞప్తి చేశారు. డ్రైవింగ్ సమయంలో క్షణికమైన నిర్లక్ష్యం కూడా ప్రాణాంతక ప్రమాదాలకు కారణమవుతుందని గుర్తు చేశారు. ప్రయాణంలో పూర్తిగా రహదారిపైనే దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. ప్రజల ప్రాణ భద్రతే తమ ప్రధాన లక్ష్యమని తెలంగాణ పోలీసులు పేర్కొన్నారు. వర్షాకాలంలో ప్రతి వాహనదారుడు బాధ్యతాయుతంగా వ్యవహరించి ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. సురక్షిత ప్రయాణం ద్వారా తమతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా కాపాడాలని పోలీసులు పిలుపునిచ్చారు.



# ఎల్‌నినోకు సమగ్ర కార్యాచరణ

- ముఖ్యమంత్రికి నిపుణుల కమిటీ నివేదిక
- వ్యవసాయ పరిరక్షణకు కీలక సిఫార్సులు
- రూ.802.92 కోట్ల కార్యాచరణ ప్రణాళిక
- ప్రత్యామ్నాయ పంటల సాగుపై ప్రత్యేక దృష్టి

**హైదరాబాద్, జూలై 30 (మన విశ్వం ):** రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొని వ్యవసాయం, ఉద్యానవనం, పశుసంవర్ధక, సాగునీరు, గ్రామీణాభివృద్ధి తదితర రంగాలను పరిరక్షించేందుకు రూపొందించిన రాష్ట్ర స్థాయి సమగ్ర కార్యాచరణ నివేదికను నిపుణుల కమిటీ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డికి గురువారం అందజేశారు. బోధి సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి, సీనియర్ అధికారులు కృపాకర్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం మీడియా సమావేశంలో డాక్టర్ జీ. చిన్నారెడ్డి మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో ఏర్పడే పరిస్థితులను ముందుగానే అంచనా వేసి వివిధ శాఖల సమన్వయంతో సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించినట్లు తెలిపారు. రైతులకు నష్టం తగ్గించేలా నీటి పొదుపు చర్యలు, ప్రత్యామ్నాయ పంటల ప్రోత్సాహం, నాణ్యమైన విత్తనాల సరఫరా, పశుగ్రాస భద్రత, ఉద్యాన పంటల విస్తరణ, వాతావరణ ఆధారిత వ్యవసాయ సలహాలకు నివేదికలో ప్రాధాన్యం ఇచ్చినట్లు వివరించారు. ఇటీవల కురిసిన వర్షాలను సద్వినియోగం చేసుకుని రైతులు ఖరీఫ్ పంటలను విజయవంతంగా సాగు చేసుకునేలా ప్రభుత్వం ఆచరణాత్మక చర్యలు చేపట్టాలని సూచించారు.




నివేదిక ప్రకారం రాష్ట్రంలో సాధారణ నైరుతి రుతుపవనాల వర్షపాతం 740.60 మిల్లీమీటర్లు కాగా, జూలై 27 నాటికి కేవలం 234.80 మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదై సుమారు 30 శాతం లోటు ఏర్పడింది. అత్యధిక జిల్లాలు వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొంటున్నాయని, జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గడంతో పాటు భూగర్భ జలమట్టాలు కూడా పడిపోయినట్లు కమిటీ పేర్కొంది. ఈ పరిస్థితుల్లో అధిక నీటి అవసరం ఉన్న పంటలకు బదులుగా కందులు, పెసలు, మినుములు, మొక్కజొన్న, జొన్న, సజ్జలు, రాగులు, నూనెగింజలు, కూరగాయలు, పశుగ్రాస పంటలను గ్రామాల వారీ ప్రణాళికతో ప్రోత్సహించాలని సిఫార్సు చేసింది. ప్రత్యామ్నాయ పంటల సాగుకు అవసరమైన విత్తనాలను 75 శాతం వరకు సబ్సిడీపై అందించాలని సూచించింది. వరి సాగును నీటి లభ్యతకు అనుగుణంగా పరిమితం చేయాలని, డ్రిప్, స్ప్రింక్లర్ వంటి సూక్ష్మ సేద్య పద్ధతులను విస్తృతంగా అమలు చేయాలని నివేదిక పేర్కొంది. వర్షపు నీటి సంరక్షణ, ఫార్మ్‌పాండ్లు, భూగర్భ జలాల పునరుద్ధరణ, మల్చింగ్, బ్రాడ్ బెడ్ అండ్ ఫరో, రిడ్జ్ అండ్ ఫరో వంటి పద్ధతులను క్షేత్రస్థాయిలో అమలు చేయాలని సూచించింది. ఉద్యాన పంటల సాగు విస్తరణ, తక్కువ వ్యవధి కూరగాయల సాగు, ఆయిల్‌పామ్, పండ్ల తోటలు, పట్టుపరిశ్రమ ఆధారిత సాగుకు ప్రోత్సాహం ఇవ్వడంతో పాటు డ్రిప్ ఇరిగేషన్, షేడ్‌నెట్ హౌస్‌లు, శాశ్వత పందిళ్ల నిర్మాణానికి సబ్సిడీలు అందించాలని పేర్కొంది. పశుసంవర్ధక రంగంలో జిల్లా వారీగా పశుగ్రాస బ్యాంకులు ఏర్పాటు చేయడం, మేత పంటల సాగు విస్తరణ, సైలేజ్, హే తయారీ, అజోల్లా సాగు, పశుగ్రాస విత్తనాల పంపిణీ, అవసరమైతే పశు శిబిరాల నిర్వహణ చేపట్టాలని కమిటీ సిఫార్సు చేసింది. గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చెక్‌డ్యాంలు, ఫార్మ్‌పాండ్లు, చెరువుల పూడికతీత, వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల రీఛార్జ్ పనులను విస్తృతంగా చేపట్టాలని సూచించింది. మిషన్ భగీరథ ద్వారా తాగునీటి సరఫరాకు ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు నీటి వనరులను సమర్థంగా వినియోగించాలని నివేదికలో పేర్కొంది. వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక శాఖలు, వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, కృషి విజ్ఞాన కేంద్రాలు, శాస్త్రవేత్తలు సమన్వయంతో రైతులకు నిరంతరం వాతావరణ ఆధారిత సాంకేతిక సలహాలు అందించాలని కమిటీ సూచించింది. గ్రామస్థాయిలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, సేంద్రియ ఎరువులు, జీవ ఎరువుల వినియోగాన్ని ప్రోత్సహించడం, వర్మీ కంపోస్ట్ యూనిట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని తెలిపింది. పంటలు, తాగునీరు, పశుగ్రాసం, విద్యుత్ సరఫరా, ప్రజారోగ్య పరిస్థితుల పర్యవేక్షణకు జిల్లా, మండల, గ్రామ స్థాయిలో ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని, అవసరమైతే ప్రత్యామ్నాయ పంటలకు మార్కెట్ జోక్యంతో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని సిఫార్సు చేసింది. ఈ సమగ్ర కార్యాచరణ ప్రణాళిక అమలుకు సుమారు రూ.802.92 కోట్ల నిధులు అవసరమవుతాయని నిపుణుల కమిటీ నివేదికలో అంచనా వేసింది.

# నీటి నిర్వహణపై ప్రభుత్వాన్ని నిలదీసిన శ్రీనివాస్ గౌడ్




- వరద జలాలను నిల్వ చేయాలని డిమాండ్
- ఆల్మట్టి ఎత్తు పెంపుపై ఆందోళన
- కాళేశ్వరం, పాలమూరు ప్రాజెక్టుల ప్రస్తావన
- సాగునీటిపై ఆంక్షలు ఎత్తివేయాలని హెచ్చరిక

**హైదరాబాద్, జూలై 30 (మన విశ్వం ):** గోదావరి, కృష్ణా నదులకు ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో రాష్ట్రానికి పెద్ద ఎత్తున వరద జలాలు వస్తున్నాయని, ఈ నీటిని పూర్తిస్థాయిలో నిల్వ చేసుకునేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. తెలంగాణ భవన్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జూరాల ప్రాజెక్టుకు భారీగా వరద వస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం రిజర్వాయర్లను నింపుకునే దిశగా చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. విద్యుత్ ఉత్పత్తి పేరుతో నీటిని దిగువకు విడుదల చేయడం సరికాదని, వెంటనే అన్ని పంపులను ప్రారంభించి ప్రతి నీటి చుక్కను ఒడిసి పట్టుకోవాలని కోరారు. పాలమూరు జిల్లాకు కృష్ణా, తుంగభద్ర, భీమ నదులే ప్రధాన ఆధారమని శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. కేవలం తాగునీటి అవసరాల కోసం మాత్రమే నీటిని నిల్వ ఉంచుతామనే ప్రభుత్వ వైఖరి సరైనది కాదని, వ్యవసాయానికి కూడా సమృద్ధిగా నీటిని అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. గోదావరి, కృష్ణా నదులపై ఉన్న అన్ని ఎత్తిపోతల పథకాలను వెంటనే పూర్తి స్థాయిలో నడిపించాలని, రైతుల ప్రయోజనాలే ప్రభుత్వానికి ప్రాధాన్యంగా ఉండాలని సూచించారు. మేడిగడ్డ బ్యారేజీలో రెండు పిల్లర్లకు మరమ్మతులు చేపడితే మళ్లీ వినియోగంలోకి తీసుకురావచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. కన్నెపల్లి వద్ద మోటార్లను ప్రారంభించకుండా ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. ఎల్‌నినో వంటి పరిస్థితులు వచ్చినా రాష్ట్రంలో కరువును తట్టుకునేలా కాళేశ్వరం ప్రాజెక్టును కేసీఆర్ రూపకల్పన చేశారని, ప్రస్తుతం ఎల్లంపల్లి నుంచి నీటిని ఎత్తిపోస్తున్నా ఆ వ్యవస్థ కూడా గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన లిఫ్టుల ద్వారానే సాధ్యమవుతోందని పేర్కొన్నారు. కర్ణాటకలో ఆల్మట్టి ప్రాజెక్టు ఎత్తు పెంపు పనులు వేగంగా జరుగుతున్నాయని శ్రీనివాస్ గౌడ్ ఆందోళన వ్యక్తం చేశారు. భూసేకరణకే లక్ష కోట్ల రూపాయల వ్యయం చేస్తున్న కర్ణాటక ప్రభుత్వ దూకుడును తెలంగాణ ప్రభుత్వం గమనించాలని అన్నారు. ఆల్మట్టి ఎత్తు పెరిగితే రాష్ట్రానికి కృష్ణా జలాల లభ్యత తగ్గి పాలమూరు, నల్లగొండ జిల్లాలపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే కర్ణాటక ముఖ్యమంత్రితో చర్చలు జరిపి ఆల్మట్టి ఎత్తు పెంపును అడ్డుకునే చర్యలు తీసుకోవాలని కోరారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి రూ.98 వేల కోట్లు మాత్రమే ఖర్చయ్యాయని, లక్ష కోట్ల రూపాయలు నీళ్లలో కలిసిపోయాయంటూ కాంగ్రెస్ నాయకులు చేస్తున్న ప్రచారం అసత్యమని శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. పాలమూరు--రంగారెడ్డి ప్రాజెక్టుతో పాటు మరికొన్ని ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులు రావడం సంతోషకరమని, ఈ అనుమతులు గతంలో కేసీఆర్ కేంద్రంపై తీసుకొచ్చిన ఒత్తిడి ఫలితంగానే వచ్చాయని అన్నారు. పాలమూరు--రంగారెడ్డి ప్రాజెక్టును ఆరు నెలల్లో పూర్తి చేసి కాలువల తవ్వకాలకు వెంటనే టెండర్లు పిలవాలని డిమాండ్ చేశారు. సాగునీటి సరఫరాపై ప్రభుత్వం విధించిన ఆంక్షలను వెంటనే ఎత్తివేయాలని శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు. సరైన సమయంలో చర్యలు తీసుకోకపోతే పాలమూరు ప్రాంతం ఎడారిగా మారే ప్రమాదం ఉందని, కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని తెలంగాణ రైతులు గమనిస్తున్నారని వ్యాఖ్యానించారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం తక్షణమే నిర్ణయాలు తీసుకోవాలని, లేకుంటే రైతులతో కలిసి ఉద్యమం చేపడతామని స్పష్టం చేశారు. ఈ విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బీరం హర్షవర్ధన్ రెడ్డి, డాక్టర్ మెతుకు ఆనంద్, బీఆర్ఎస్ నాయకుడు బొమ్మెర రామమూర్తి పాల్గొన్నారు.

# భారీ వర్షాలపై అప్రమత్తం

- జిల్లా యంత్రాంగానికి సి.ఎస్. కీలక ఆదేశాలు
- కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు, సహాయక బృందాల సిద్ధం
- ప్రమాదకర పర్యాటక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా
- రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించాలని సూచన

**హైదరాబాద్, జూలై 30 (మన విశ్వం ):** రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు, ఎస్పీలను ఆదేశించారు. గత రెండు రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న వర్షాలు, మరో రెండు రోజుల పాటు కొనసాగనున్న నేపథ్యంలో చేపట్టాల్సిన చర్యలపై డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయం నుంచి గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి అధికారులకు పలు సూచనలు చేశారు. జిల్లా కేంద్రాల్లో వెంటనే కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసి పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని ప్రధాన కార్యదర్శి ఆదేశించారు. పోలీసు శాఖతో పాటు ఇతర విభాగాలతో సమన్వయం చేసుకుని సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు. జలపాతాలు, ప్రమాదకర ప్రాంతాలు ఉన్న పర్యాటక ప్రాంతాలకు ప్రజలు వెళ్లకుండా తగిన నియంత్రణ చర్యలు తీసుకోవాలని, అవసరమైన చోట



హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. గోదావరి పరీవాహక ప్రాంతాల జిల్లాల కలెక్టర్లు వరద పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని సంజయ్ జాజు సూచించారు. అవసరమైన ప్రాంతాల్లో ముందస్తు తరలింపు చర్యలు చేపట్టాలని, సహాయక శిబిరాలు సిద్ధంగా ఉంచాలని తెలిపారు. ఇప్పటికే జాతీయ, రాష్ట్ర విపత్తు స్పందన దళాల బృందాలను అందుబాటులో ఉంచామని, జిల్లాలకు అవసరమైన సహాయం తక్షణమే అందిస్తామని స్పష్టం చేశారు. వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో వ్యవసాయ రంగంపైనా ప్రత్యేక దృష్టి సారించాలని ప్రధాన కార్యదర్శి పేర్కొన్నారు. ఎల్‌నినో ప్రభావంతో సెప్టెంబర్‌లో కూడా వర్షపాతం తక్కువగా ఉండే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోందని, అందువల్ల రైతులు వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి పెట్టేలా అవగాహన కల్పించాలని కలెక్టర్లకు సూచించారు. ముఖ్యంగా కూరగాయల సాగు చేపడితే మార్కెట్‌లో మంచి ధరతో పాటు కొనుగోలు సౌకర్యాలు కూడా లభిస్తాయని తెలిపారు.వచ్చే రెండు రోజుల్లో భారీ వర్షాలు కురిసే జిల్లాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు అప్రమత్తంగా పనిచేయాలని ప్రధాన కార్యదర్శి ఆదేశించారు. ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షిస్తూ అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేలా జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉండాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీజీపీ సి.వి. ఆనంద్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 249 ప్రమాదకర జలాశయాలు, పిక్నిక్ ప్రాంతాలను గుర్తించినట్లు తెలిపారు. అదనంగా 167 పర్యాటక ప్రాంతాల్లో కూడా వర్షాల సమయంలో ప్రజల ప్రవేశాన్ని నియంత్రించేందుకు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. 12 ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచినట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ డీజీ భగవత్, విపత్తు నిర్వహణ శాఖ కార్యదర్శి హరిచందన, నీటిపారుదల శాఖ కార్యదర్శి శ్రీధర్, వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# వేములవాడ బస్‌స్టేషన్‌కు కొత్త రూపు

- రూ.1.62 కోట్లతో ఆధునీకరణ పనులకు శ్రీకారం
- కోరుట్ల మీదుగా బాసరకు కొత్త ఎక్స్‌ప్రెస్ బస్సు ప్రారంభం
- మహాలక్ష్మి పథకం విజయవంతంగా అమలవుతోందన్న మంత్రి
- ఆర్టీసీ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని వెల్లడి

**రాజన్న సిరిసిల్ల, జూలై 30 (మన విశ్వం ):** మహాలక్ష్మి పథకం ద్వారా రాష్ట్రంలోని మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తోందని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ తిప్పాపూర్ బస్‌స్టేషన్ ఆధునీకరణ పనులకు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి గురువారం శంకుస్థాపన చేశారు. అనంతరం వేములవాడ--కోరుట్ల మీదుగా బాసరకు కొత్త ఎక్స్‌ప్రెస్ బస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే మహిళలకు మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణాన్ని అమలు చేసి ఇచ్చిన హామీని నిలబెట్టుకుందని తెలిపారు. ఈ పథకం వల్ల మహిళల ప్రయాణాలు గణనీయంగా పెరగడంతో పాటు ఆర్టీసీలో ప్రయాణికుల సంఖ్య కూడా పెరిగిందన్నారు. ఇప్పటివరకు 334.11 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణించి సుమారు రూ.11,668 కోట్ల మేర ప్రయాణ వ్యయాన్ని ఆదా చేసుకున్నారని వెల్లడించారు.1984లో నిర్మించిన వేములవాడ బస్‌స్టేషన్‌ను రూ.1.62 కోట్ల వ్యయంతో ఆధునీకరిస్తున్నామని మంత్రి తెలిపారు. దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడకు ప్రతిరోజూ సుమారు 250 బస్సులు, 560 ట్రిప్పులు నడుస్తున్నాయని, రోజుకు దాదాపు 50 వేల మంది ప్రయాణికులు ఈ బస్‌స్టేషన్‌ను వినియోగిస్తున్నారని చెప్పారు.




కోరుట్ల మీదుగా బాసరకు కొత్త ఎక్స్‌ప్రెస్ బస్సును ప్రారంభించామని, గతంలో ముంబైకి కూడా బస్సు సౌకర్యం కల్పించినట్లు గుర్తు చేశారు. నష్టాల్లో ఉన్న ఆర్టీసీని ప్రభుత్వం లాభాల బాట పట్టించిందని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 2,600 కొత్త బస్సులు కొనుగోలు చేశామని, సిబ్బంది నియామకాలు చేపట్టడంతో పాటు దాదాపు రూ.100 కోట్లతో బస్‌స్టేషన్ల అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ఆర్టీసీ ఉద్యోగులకు సుమారు రూ.1,000 కోట్ల భవిష్య నిధి బకాయిలు, రూ.600 కోట్ల సీసీఎస్ బకాయిలు చెల్లించినట్లు వెల్లడించారు.
వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రధాన దేవాలయ ప్రాంతాల్లో మౌలిక వసతులను మెరుగుపర్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. తెలంగాణ ఆర్టీసీ దేశంలోనే అతిపెద్ద ప్రజారవాణా సంస్థగా మహిళలకు ఉచిత ప్రయాణాన్ని విజయవంతంగా అందిస్తోందని పేర్కొన్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలను సద్వినియోగం చేసుకుని రైతులు ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని, అదే క్రమంలో బస్‌స్టేషన్ ఆధునీకరణ కూడా ముఖ్యమైన అడుగని తెలిపారు. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ వేములవాడ తిప్పాపూర్ బస్‌స్టేషన్ ఆధునీకరణకు రూ.1.62 కోట్లు మంజూరు చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఆధునీకరించిన బస్‌స్టేషన్ వల్ల రాజరాజేశ్వర స్వామి ఆలయానికి వచ్చే లక్షలాది మంది భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, సంజయ్ కుమార్, ఎస్పీ మహేష్ బి. గితే, మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బోనాలకు గవర్నర్‌కు ఆహ్వానం




- కొండా సురేఖ మర్యాదపూర్వక భేటీ
- లష్కర్ బోనాల ఉత్సవాలకు ఆహ్వాన పత్రం
- లోక్ భవన్‌లో సమావేశం

**హైదరాబాద్, జూలై 30 (మన విశ్వం ):** తెలంగాణలో నిర్వహించనున్న ఆషాఢ జాతర (లష్కర్ బోనాలు) ఉత్సవాలకు రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లాను ఆహ్వానించారు. ఈ మేరకు అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ గురువారం హైదరాబాద్‌లోని లోక్ భవన్‌లో గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు కూడా సమావేశంలో పాల్గొన్నారు. సికింద్రాబాద్‌లో జరగనున్న ఆషాఢ జాతర, లష్కర్ బోనాల ఉత్సవాల విశిష్టత, ఏర్పాట్ల గురించి గవర్నర్‌కు వివరించారు. ఉత్సవాలకు హాజరై భక్తులను ఆశీర్వదించాలని కోరారు.
మంత్రి కొండా సురేఖ బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే మహోత్సవమని తెలిపారు. ప్రతి ఏడాది లక్షలాది మంది భక్తులు పాల్గొనే ఈ ఉత్సవాలు రాష్ట్ర సాంస్కృతిక వైభవాన్ని ప్రతిబింబిస్తాయని పేర్కొన్నారు. ఈసారి కూడా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు, భక్తులకు అవసరమైన సౌకర్యాలు, భద్రతా చర్యలు చేపడుతున్నట్లు కమిషనర్ హనుమంతరావు గవర్నర్‌కు వివరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు.
గవర్నర్ శివప్రతాప్ శుక్లా ఆహ్వానాన్ని స్వీకరించి బోనాల ఉత్సవాల నిర్వహణపై వివరాలను అడిగి తెలుసుకున్నట్లు రాజ్‌భవన్ వర్గాలు తెలిపాయి. తెలంగాణ సంస్కృతిలో బోనాల పండుగకు ఉన్న విశిష్ట స్థానాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించినట్లు సమాచారం. లోక్ భవన్‌లో జరిగిన ఈ మర్యాదపూర్వక భేటీ స్నేహపూర్వక వాతావరణంలో సాగింది. బోనాల ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించేందుకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలపై చర్చించినట్లు వెల్లడించారు. రాష్ట్ర ప్రజలు భక్తిశ్రద్ధలతో బోనాల వేడుకల్లో పాల్గొని పండుగను ఘనంగా నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు.

# భారీ వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి

- ప్రజలకు హైదరాబాద్ పోలీసుల కీలక సూచనలు
- ట్రాఫిక్ పరిస్థితులను పరిశీలించిన వీసీ సజ్జనర్
- జీహెచ్ఎంసీతో సమన్వయంగా సహాయక చర్యలు
- అత్యవసరమైతేనే బయటకు రావాలని విజ్ఞప్తి



**హైదరాబాద్, జూలై 30 (మన విశ్వం ):** భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ పోలీసు కమిషనర్ వీసీ సజ్జనర్ సూచించారు. వాతావరణ కేంద్రం విడుదల చేస్తున్న సమాచారం, హెచ్చరికలను ప్రజలు ఎప్పటికప్పుడు గమనించాలని, వర్ష సూచనలకు అనుగుణంగా తమ రోజువారీ ప్రయాణాలను ముందస్తుగా ప్రణాళిక చేసుకోవడం మంచిదని తెలిపారు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో అనవసర ప్రయాణాలను నివారించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వర్షాల నేపథ్యంలో గురువారం పంజాగుట్ట, ఖైరతాబాద్ కూడళ్ల వద్ద వాహనాల రాకపోకలు, రహదారులపై ట్రాఫిక్ పరిస్థితులను వీసీ సజ్జనర్ స్వయంగా పరిశీలించారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారులతో మాట్లాడి ట్రాఫిక్ నియంత్రణకు సంబంధించిన పలు సూచనలు చేశారు. వర్షాల కారణంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.నగరంలో వర్షాల వల్ల ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పోలీసు శాఖ జీహెచ్ఎంసీతో పాటు ఇతర ప్రభుత్వ శాఖలతో పూర్తి సమన్వయంతో పనిచేస్తోందని కమిషనర్ తెలిపారు. క్షేత్రస్థాయిలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీసు సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉంటారని, అవసరమైన చోట వెంటనే స్పందించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. వర్షం కురుస్తున్న సమయంలో తెరిచి ఉన్న మ్యాన్‌హోళ్లు, తెగిపడిన విద్యుత్ వైర్లు, విద్యుత్ స్తంభాలకు దూరంగా ఉండాలని ప్రజలను హెచ్చరించారు. నీరు ఎక్కువగా నిలిచే లోతట్టు ప్రాంతాలు, వంతెనలు, ఎగువ వంతెనల వద్ద వాహనదారులు వేగాన్ని తగ్గించి అత్యంత జాగ్రత్తగా ప్రయాణించాలని సూచించారు. ప్రమాదకర ప్రాంతాల్లో అధికారులు ఇచ్చే సూచనలను తప్పనిసరిగా పాటించాలని కోరారు.

వాతావరణ కేంద్రం మరో రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరిస్తోందని కమిషనర్ తెలిపారు. ఈ నేపథ్యంలో అత్యవసర పరిస్థితులు మినహా వర్షం కురుస్తున్న సమయంలో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావద్దని విజ్ఞప్తి చేశారు. అత్యవసర పరిస్థితులు తలెత్తినా లేదా ట్రాఫిక్ సహాయం అవసరమైనా వెంటనే డయల్--100ను సంప్రదించాలని సూచించారు. ప్రజల సౌకర్యార్థం నగర ట్రాఫిక్ పోలీసు విభాగం సామాజిక మాధ్యమాలు, ఇతర సమాచార మాధ్యమాల ద్వారా ఎప్పటికప్పుడు ట్రాఫిక్ సూచనలు, హెచ్చరికలు విడుదల చేస్తోందని వీసీ సజ్జనర్ తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆ సూచనలను క్రమం తప్పకుండా పాటిస్తూ సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేరుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల సహకారంతో వర్షాల సమయంలో ప్రమాదాలను నివారించవచ్చని హైదరాబాద్ సిటీ పోలీసులు పేర్కొన్నారు.

# హుస్నాబాద్‌లో ట్రాఫిక్ అవుట్‌పోస్ట్ ప్రారంభం

- ట్రాఫిక్ నిర్వహణకు కొత్త మైలురాయి
- ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యమన్న పోలీసు కమిషనర్
- రహదారి నిబంధనలు పాటించాలని సూచన
- హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని విజ్ఞప్తి



**సిద్దిపేట, జూలై 30 (మన విశ్వం ):** సిద్దిపేట పోలీసు కమిషనరేట్ పరిధిలోని హుస్నాబాద్‌లో నూతన ట్రాఫిక్ అవుట్‌పోస్ట్‌ను పోలీసు కమిషనర్ రష్మి పెరుమాళ్ ప్రారంభించారు. ట్రాఫిక్ నిర్వహణను మరింత సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు ప్రజల భద్రతను బలోపేతం చేసే దిశగా ఈ అవుట్‌పోస్ట్ కీలకంగా మారనుందని అధికారులు తెలిపారు. నూతన ట్రాఫిక్ అవుట్‌పోస్ట్ ప్రారంభంతో హుస్నాబాద్ పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణ, రద్దీ ప్రాంతాల పర్యవేక్షణ, రహదారి భద్రత చర్యలు మరింత సమర్థవంతంగా అమలు చేయడానికి అవకాశం ఏర్పడుతుందని పోలీసు అధికారులు పేర్కొన్నారు. ప్రమాదాలను తగ్గించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.

ఈ సందర్భంగా పోలీసు కమిషనర్ రష్మి పెరుమాళ్ మాట్లాడుతూ రహదారి భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, నిర్లక్ష్యంగా వాహనాలు నడపకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రజల సహకారంతోనే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని పేర్కొన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు. హెల్మెట్ వినియోగం ప్రాణాలను కాపాడడంలో కీలక పాత్ర పోషిస్తుందని, చిన్న నిర్లక్ష్యం కూడా తీవ్ర ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని హెచ్చరించారు. వాహనదారులు తమ భద్రతతో పాటు ఇతరుల భద్రతను కూడా దృష్టిలో ఉంచుకుని ప్రయాణించాలని సూచించారు.ట్రాఫిక్ అవగాహన కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించి ప్రజల్లో రహదారి భద్రతపై చైతన్యం పెంపొందించేందుకు పోలీసు శాఖ చర్యలు కొనసాగిస్తోందని అధికారులు తెలిపారు. విద్యార్థులు, యువత, వాహనదారులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. హుస్నాబాద్‌లో ఏర్పాటు చేసిన ఈ నూతన ట్రాఫిక్ అవుట్‌పోస్ట్ ద్వారా ట్రాఫిక్ నియంత్రణ, ప్రజలకు వేగవంతమైన సేవలు, రహదారి భద్రత చర్యలు మరింత మెరుగుపడనున్నాయని పోలీసు శాఖ అభిప్రాయపడింది. ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ సురక్షిత ప్రయాణానికి సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

# భారీ వర్షాలపై అప్రమత్తం

- భీమన్న వాగు, మత్తడి ప్రాజెక్టు పరిశీలన
- కలెక్టర్, ఎస్పీ సంయుక్తంగా పర్యటన
- అధికారులు, ప్రజలకు అప్రమత్తత సూచనలు
- లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక నిఘా



**ఆదిలాబాద్, జూలై 30 (మన విశ్వం ):** జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో వరద పరిస్థితులను అంచనా వేసేందుకు జిల్లా కలెక్టర్ రాజర్షి షా, జిల్లా పోలీసు అధికారి అఖిల్ మహాజన్‌తో కలిసి గురువారం తాంసి మండలంలో పర్యటించారు. భీమన్న వాగు కల్వర్టు ప్రాంతంతో పాటు మత్తడి వాగు ప్రాజెక్టును పరిశీలించి పరిస్థితిని సమీక్షించారు. అధికారులు, ప్రజలు పూర్తి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. భీమన్న వాగు వద్ద నీటి ప్రవాహాన్ని పరిశీలించిన కలెక్టర్, వాగులు, వంకల వద్ద ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఇవ్వొద్దని అధికారులను ఆదేశించారు. భారీ వర్షాల సమయంలో ప్రజలు ప్రమాదకర ప్రాంతాల్లోకి వెళ్లకుండా తగిన చర్యలు తీసుకోవాలని, అవసరమైన చోట హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు.మత్తడి వాగు ప్రాజెక్టు వద్ద నీటి మట్టం, ప్రవాహ పరిస్థితులపై నీటిపారుదల శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. వరద పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైతే ముందస్తు చర్యలు చేపట్టాలని, లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఎలాంటి అత్యవసర పరిస్థితి ఎదురైనా వెంటనే స్పందించేలా యంత్రాంగం సిద్ధంగా ఉండాలని సూచించారు. జిల్లా పోలీసు అధికారి అఖిల్ మహాజన్ మాట్లాడుతూ ప్రజల భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని పోలీసు సిబ్బందికి సూచించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో పోలీసులు నిరంతర పహారా నిర్వహించాలని, ప్రమాదకర ప్రాంతాల్లో ప్రజలను వెళ్లనీయకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అవసరమైతే స్థానిక ప్రజలకు ముందస్తు హెచ్చరికలు జారీ చేయాలని సూచించారు.

వర్షాలు కొనసాగుతున్న నేపథ్యంలో రెవెన్యూ, నీటిపారుదల, పోలీసు శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. నీటి ప్రవాహం అధికంగా ఉన్న ప్రాంతాల్లో ప్రజలు వాహనాలతో దాటే ప్రయత్నం చేయరాదని, అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని విజ్ఞప్తి చేశారు. ఈ పర్యటనలో తాంసి, తలమడుగు తహసీల్దార్లు గణేష్, రాజ్‌మోహన్, నీటిపారుదల శాఖ కార్యనిర్వాహక ఇంజినీర్ నరేష్, ఉప కార్యనిర్వాహక ఇంజినీర్ శ్రీనివాస్‌రావు, సహాయ కార్యనిర్వాహక ఇంజినీర్ హరీష్, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. జిల్లాలో వర్షాల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రజల ప్రాణ, ఆస్తుల రక్షణకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.

# ఆటో డ్రైవర్లకు కవిత భరోసా

- లాస్ట్ మైల్ విధానంపై తీవ్ర అభ్యంతరం
- ఆటో యూనియన్లతో చర్చించాలని డిమాండ్
- ఉపాధి దెబ్బతింటే ఉద్యమిస్తామని హెచ్చరిక
- ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి పిలుపు



**హైదరాబాద్, జూలై 30 (మన విశ్వం ):** బంజారాహిల్స్‌లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో ఆటో డ్రైవర్లతో అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సమావేశమయ్యారు. లాస్ట్ మైల్ కనెక్టివిటీ పేరుతో ప్రభుత్వం అమలు చేయనున్న విధానం వల్ల తమ ఉపాధి కోల్పోతామంటూ ఆటో డ్రైవర్లు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారి సమస్యలు విన్న కవిత, ఆటో డ్రైవర్లకు తమ పూర్తి మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు. కవిత మాట్లాడుతూ లాస్ట్ మైల్ కనెక్టివిటీ పేరుతో ప్రభుత్వం ఆటో డ్రైవర్ల జీవనోపాధిపై ప్రభావం చూపే నిర్ణయాలు తీసుకోవడం సరికాదన్నారు. ప్రయాణికులు బస్సు దిగిన తర్వాత ప్రస్తుతం ఉన్న ఆటోలను వినియోగించుకునే అవకాశం ఉండగా, అదే సేవను ప్రభుత్వమే నిర్వహించాలని చూడటం వేలాది మంది ఆటో డ్రైవర్లకు నష్టం కలిగిస్తుందని పేర్కొన్నారు. ఇప్పటికే ఆటోలు నడుపుతున్న వారికే లాస్ట్ మైల్ కనెక్టివిటీ సేవల్లో అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.

మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలులోకి వచ్చిన తర్వాత ఆటో డ్రైవర్ల ఆదాయం గణనీయంగా తగ్గిందని కవిత అన్నారు. చాలామంది ఆటో డ్రైవర్లు వాహనాల రుణాల వాయిదాలు కూడా చెల్లించలేని పరిస్థితిలో ఉన్నారని పేర్కొన్నారు. ఇలాంటి సమయంలో ప్రభుత్వం ఈవీ ఆటోలను ప్రవేశపెట్టి వాటిని ప్రభుత్వ ఆధ్వర్యంలో నడపాలని ప్రయత్నించడం ఆటో డ్రైవర్లకు మరింత భారంగా మారుతుందని విమర్శించారు. ఆటో డ్రైవర్లకు వన్ స్టేట్--వన్ పర్మిట్ విధానం అమలు చేస్తామని, ఏటా రూ.12 వేల ఆర్థిక సాయం అందిస్తామని ఇచ్చిన హామీలు ఇంకా నెరవేరలేదని కవిత ఆరోపించారు. మరోవైపు నిబంధనల ఉల్లంఘన పేరుతో వరుసగా చలాన్లు విధించడం వల్ల డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆటో యూనియన్లతో చర్చించి వారి ప్రయోజనాలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవాలని కోరారు.లాస్ట్ మైల్ కనెక్టివిటీ సేవలను ఇప్పటికే ఆటోలు నడుపుతున్న డ్రైవర్ల ద్వారానే అమలు చేయాలని కవిత డిమాండ్ చేశారు. కరీంనగర్, వరంగల్, నిజామాబాద్ తదితర నగరాల్లో కూడా ఈవీ ఆటోలను ప్రవేశపెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొంటూ, ఆటో డ్రైవర్ల ప్రయోజనాలను దెబ్బతీసే విధంగా ఎలాంటి నిర్ణయాలు తీసుకున్నా తీవ్రంగా వ్యతిరేకిస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోకపోతే తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లతో కలిసి ఇందిరా పార్క్ వద్ద ధర్నా నిర్వహిస్తామని కవిత ప్రకటించారు. రాష్ట్రంలోని అన్ని ఆటో డ్రైవర్లకు మేలు జరిగేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.

# నేతన్నల సంక్షేమానికి పెద్దపీట

- రగుడు జంక్షన్ అభివృద్ధి పనులకు శ్రీకారం
- చేనేత కార్మికులకు ఆర్డీ పాస్‌బుక్‌ల పంపిణీ
- వస్త్ర పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వ కట్టుబాటు
- సిరిసిల్ల నేతన్నలకు మరిన్ని అవకాశాల కల్పన



**రాజన్న సిరిసిల్ల, జూలై 30 (మన విశ్వం ):** సిరిసిల్ల నేతన్నల సంక్షేమం, వస్త్ర పరిశ్రమ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని జిల్లా ఇంచార్జి మంత్రి, మార్కెటింగ్, వ్యవసాయ, చేనేత జౌళి, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని రగుడు వద్ద రూ.3.22 కోట్లతో చేపట్టిన జంక్షన్ అభివృద్ధి, సుందరీకరణ, మోడల్ బస్ షెల్టర్ల నిర్మాణ పనులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో పాటు రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం శంకుస్థాపన చేశారు. అనంతరం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో నిర్వహించిన కార్యక్రమంలో త్రిఫ్ట్ ఫండ్ పథకానికి సంబంధించిన ఆర్డీ పాస్‌బుక్‌లను అర్హులైన చేనేత కార్మికులకు మంత్రులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ సిరిసిల్ల అంటే చేనేతకు ప్రతీక అని, నేతన్నల కష్టానికి ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. గత రెండేళ్లలోనే చేనేత రంగానికి రూ.1,360 కోట్లకు పైగా ఆర్థిక సహాయం అందించామని, నేతన్నలకు ఏడాది పొడవునా ఉపాధి కల్పించడంతో పాటు భద్రత, బీమా, సంక్షేమ పథకాల అమలుపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు.చేనేత ఉత్పత్తులకు మార్కెట్ కల్పించేందుకు ప్రభుత్వం అధిక ధర చెల్లించాల్సి వచ్చినా నాణ్యమైన చీరలనే కొనుగోలు చేస్తోందని మంత్రి పేర్కొన్నారు. యార్న్ డిపో ఏర్పాటుతో చేనేత సహకార సంఘాలకు మరింత ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. నేతన్నల సమస్యలను ప్రజాప్రతినిధుల ద్వారా ప్రభుత్వ దృష్టికి తీసుకొస్తే వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేస్తోందని, ఉమ్మడి కరీంనగర్ జిల్లాతో పాటు సిరిసిల్ల ప్రాంత అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తోందని తెలిపారు. రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ సిరిసిల్లలో నాణ్యమైన ఇందిరా మహిళా శక్తి చీరలు తయారవుతున్నాయని, ప్రభుత్వం నేతన్నలకు నిరంతర ఉపాధి కల్పిస్తూ మహిళలకు నాణ్యమైన చీరలు అందిస్తోందన్నారు. సిరిసిల్ల చీరలకు భౌగోళిక గుర్తింపు వచ్చేలా ప్రత్యేక కృషి చేయాలని సూచించారు. నేతన్నల అభ్యున్నతికి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు.ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వస్త్ర పరిశ్రమలో పెండింగ్ బకాయిలను దశలవారీగా విడుదల చేసి నేతన్నల్లో విశ్వాసాన్ని పెంచిందన్నారు. 2024--25 సంవత్సరానికి 6.80 కోట్ల మీటర్ల చీరల తయారీకి ఆర్డర్లు ఇచ్చి వేలాది మంది నేతన్నలకు ఎనిమిది నెలల ఉపాధి కల్పించామని తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి 3 కోట్ల మీటర్ల చీరల తయారీకి ఆర్డర్లు ఇచ్చామని, ఇప్పటికే కోటి మీటర్ల ఉత్పత్తి పూర్తైందని వెల్లడించారు. రూ.62 కోట్ల బిల్లులు చెల్లించడంతో పాటు రూ.50 కోట్లతో వేములవాడలో యార్న్ బ్యాంక్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 25 హెచ్‌పీ పవర్‌లూమ్‌లకు విద్యుత్ సబ్సిడీ, కామన్ ఫెసిలిటీ సెంటర్ ఏర్పాటు వంటి చర్యలు కూడా చేపడుతున్నామని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ వేములవాడకు వచ్చే భక్తులు, పర్యాటకులు సేదతీరేలా గుడి చెరువు బండ్ పార్క్‌ను అభివృద్ధి చేసి ప్రారంభించామని తెలిపారు. రగుడు బైపాస్ జంక్షన్ సుందరీకరణలో వస్త్ర తయారీ వివిధ దశలను ప్రతిబింబించే శిల్పాలను ఏర్పాటు చేశామని వివరించారు. గత ఏడాది జిల్లాలో తయారైన ఇందిరా మహిళా శక్తి చీరలకు విశేష ఆదరణ లభించిందని, మహిళలు వాటిని పండుగలు, శుభకార్యాల్లో ధరిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, ఎస్పీ మహేష్ బి. గితే, మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ స్వరూప తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పల్‌లో అభివృద్ధి పనులకు శ్రీకారం

- రూ. మౌలిక వసతుల పనులకు శంకుస్థాపనలు
- రోడ్లు, డ్రైనేజీలు, క్రీడా వేదికల అభివృద్ధికి ప్రాధాన్యం
- ప్రజలకు మెరుగైన పౌర సౌకర్యాలే లక్ష్యమన్న మంత్రి



**హైదరాబాద్, జూలై 30 (మన విశ్వం ):** రాష్ట్ర సమాచార సాంకేతిక, ఎలక్ట్రానిక్స్, సమాచార ప్రసారాలు, పరిశ్రమలు, వాణిజ్య, శాసన వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఉప్పల్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. నగర మౌలిక వసతులను బలోపేతం చేసి ప్రజలకు మెరుగైన పౌర సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. రామంతాపూర్‌లో భజరంగ్ వ్యాయామశాల అభివృద్ధి పనులతో పాటు వర్షపు నీటి కాలువలు, సిమెంట్ కాంక్రీట్ రహదారులు, పాదచారుల మార్గాలు, బహుళ క్రీడా వేదిక నిర్మాణం, ఉప్పల్ భగాయత్‌లో బస్సు నిలయాల అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ పనులు పూర్తయితే స్థానిక ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని అధికారులు తెలిపారు.

బొడ్రాయి--చిల్కానగర్ ప్రాంతంలో రహదారులు, డ్రైనేజీల అభివృద్ధి పనులతో పాటు చెర్లపల్లిలో ప్రధాన వర్షపు నీటి కాలువలు, రహదారి మౌలిక వసతుల అభివృద్ధి పనులను కూడా మంత్రి ప్రారంభించారు. వర్షాకాలంలో నీటి నిల్వ సమస్యలు తగ్గించడంతో పాటు రాకపోకలు సులభతరం చేయడమే ఈ పనుల ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఉప్పల్ నియోజకవర్గంలో వేగంగా పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఆధునిక మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. రహదారులు, డ్రైనేజీలు, క్రీడా వేదికలు, ప్రజా రవాణా సౌకర్యాల అభివృద్ధితో ప్రజల జీవన ప్రమాణాలు మరింత మెరుగుపడతాయని ఆయన పేర్కొన్నారు.అభివృద్ధి పనులను నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పనులు చేపట్టాలని, ప్రతి రూపాయి ప్రజలకు ఉపయోగపడేలా పారదర్శకంగా అమలు చేయాలని సూచించారు. స్థానిక అవసరాలను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనూ చౌదరి, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వినయ్ కృష్ణారెడ్డి, ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధికా గుప్తా, కీసర రెవెన్యూ డివిజనల్ అధికారి, మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన ఇంజనీర్, డిప్యూటీ కమిషనర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ప్రజాప్రతినిధులు, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# వర్షాలపై మంత్రి సమీక్ష

- రోడ్ల పరిస్థితిపై అధికారులతో సమీక్ష సమావేశం
- ముంపు ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లకు ఆదేశాలు
- ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచన
- క్షేత్రస్థాయిలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశం



**హైదరాబాద్, జూలై 30 (మన విశ్వం ):** రాష్ట్రంలో గత రెండు రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో రహదారులు, వంతెనల పరిస్థితిపై రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలు, రోడ్లు--భవనాల శాఖ డివిజన్ల వారీగా రహదారులు, వంతెనలు, లోకాజ్ వేలు, కల్వర్టుల పరిస్థితిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ముంపునకు గురైన ప్రాంతాల్లో రహదారుల రాకపోకలు నిలిచిపోకుండా ప్రత్యామ్నాయ మార్గాలను వెంటనే అందుబాటులోకి తీసుకురావాలని మంత్రి అధికారులను ఆదేశించారు. వర్షాల ప్రభావంతో దెబ్బతిన్న ప్రాంతాల్లో ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని, అవసరమైన చోట తక్షణమే మరమ్మతు పనులు చేపట్టాలని సూచించారు.

కల్వర్టులు, లోకాజ్ వేలు, కోతకు గురైన రహదారుల వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. నిర్మాణంలో ఉన్న రహదారులు, వంతెనల వద్ద కూడా అన్ని రకాల భద్రతా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రమాదకర ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేయడానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. రహదారులు, వంతెనల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ అధికారులు క్షేత్రస్థాయిలోనే అందుబాటులో ఉండాలని మంత్రి ఆదేశించారు. ప్రతి జిల్లాలో పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ సమస్యలు తలెత్తిన వెంటనే స్పందించాలని చెప్పారు. అత్యవసర పరిస్థితుల్లో వేగంగా చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు.

రెవెన్యూ, పోలీసు, విద్యుత్, సాగునీటి శాఖలతో సమన్వయం చేసుకుంటూ సహాయక చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. ప్రతి రోజు క్షేత్రస్థాయి నివేదికలు సిద్ధం చేయాలని, జిల్లా ఇంజనీర్లతో రోజువారీగా మొబైల్ ఫోన్ ద్వారా సమీక్ష నిర్వహిస్తానని వెల్లడించారు. శాఖల మధ్య సమన్వయంతో పనిచేస్తే సమస్యలను వేగంగా పరిష్కరించవచ్చని పేర్కొన్నారు. ఇంజనీర్-ఇన్-చీఫ్ నుంచి సహాయ ఇంజనీర్ స్థాయి వరకు ప్రతి అధికారి పూర్తిస్థాయి అప్రమత్తతతో విధులు నిర్వహించాలని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆదేశించారు. వర్షాకాలం ముగిసే వరకు ప్రజలకు ఇబ్బందులు కలగకుండా రహదారుల భద్రత, రాకపోకల సౌకర్యం, అత్యవసర సేవలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి స్పష్టం చేశారు.

# గోదావరిపై వరద అప్రమత్తం

- మొదటి ప్రమాద హెచ్చరికకు ముందస్తు సన్నద్ధత
- అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశం
- పునరావాస కేంద్రాల్లో మౌలిక సదుపాయాల ఏర్పాట్లు
- ప్రజల ప్రాణ రక్షణకు సమన్వయ చర్యలు



**భద్రాద్రి కొత్తగూడెం, జూలై 30 (మన విశ్వం ):** ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల ప్రభావంతో గోదావరి నదిలో నీటిమట్టం క్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ అయ్యే అవకాశం ఉన్నందున అన్ని ప్రభుత్వ శాఖలు పూర్తి సన్నద్ధంగా ఉండి ముందస్తు చర్యలను ముమ్మరం చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. గోదావరి వరద పరిస్థితులపై నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. గోదావరి పరివాహక ప్రాంతాల్లోని ప్రజలను ముందుగానే అప్రమత్తం చేయాలని, అవసరమైతే సురక్షిత ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలించాలని కలెక్టర్ సూచించారు. పునరావాస కేంద్రాల్లో తాగునీరు, ఆహారం, వైద్య సేవలు, విద్యుత్ సరఫరా, పారిశుద్ధ్య సౌకర్యాలు ఎలాంటి లోటు లేకుండా సిద్ధంగా ఉంచాలని సంబంధిత శాఖలకు ఆదేశాలు జారీ చేశారు.మత్స్యశాఖ, పోలీసు, రెవెన్యూ, అగ్నిమాపక, వైద్య, పంచాయతీరాజ్, విద్యుత్ శాఖలు అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉండాలని కలెక్టర్ పేర్కొన్నారు. గజ ఈతగాళ్లు, బోట్లు, లైఫ్ జాకెట్లు, అవసరమైన పరికరాలు, అత్యవసర సిబ్బందిని అందుబాటులో ఉంచి ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనే విధంగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. గోదావరి స్నాన ఘాట్లు, నది తీరాలు, పర్యాటక ప్రాంతాల్లో బ్యారికేడ్లు ఏర్పాటు చేసి ప్రజలు నదిలోకి వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గోదావరి ప్రవాహం సాధారణ స్థితికి చేరుకునే వరకు చేపల వేట, పడవల రాకపోకలను నియంత్రించాలని సూచించారు. ప్రమాదకర ప్రాంతాల్లో నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు. గురువారం సాయంత్రం 6 గంటల నాటికి భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 28.40 అడుగులకు చేరుకోగా, ప్రవాహం 3,88,452 క్యూసెక్కులుగా నమోదైంది. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కొనసాగుతున్న నేపథ్యంలో నీటిమట్టం మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రజల ప్రాణ, ఆస్తుల రక్షణకు అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ అంకిత్ అన్ని శాఖల అధికారులకు స్పష్టం చేశారు. ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా శాఖల మధ్య సమన్వయంతో పనిచేసి వరద ప్రభావాన్ని తగ్గించే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు వేగంగా సహాయ సహకారాలు అందేలా జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండాలని సూచించారు.

# నర్వ ఆదర్శ మండలం కావాలి

- యాంకీలో కంటైనర్ అంగన్‌వాడీ కేంద్రం ప్రారంభం
- అభివృద్ధి కార్యక్రమాలకు కలెక్టర్ ప్రియాంక పిలుపు
- చిన్నారుల విద్య, పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి
- ప్రత్యామ్నాయ పంటల సాగు చేయాలని రైతులకు సూచన



**నారాయణపేట, జూలై 30 (మన విశ్వం):** నర్వ మండలం జాతీయ స్థాయిలో ఆదర్శ మండలంగా గుర్తింపు పొందేలా అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు సమష్టిగా కృషి చేయాలని నారాయణపేట జిల్లా కలెక్టర్ ప్రియాంక పిలుపునిచ్చారు. గురువారం నర్వ మండలంలోని యాంకీ గ్రామంలో ఏర్పాటు చేసిన నూతన కంటైనర్ అంగన్‌వాడీ కేంద్రాన్ని గ్రామ సర్పంచి కల్యాణితో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా సరస్వతి మాత చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించి, కేంద్రంలోని చిన్నారులతో మమేకమయ్యారు. అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల హాజరు, అందుతున్న సేవలపై కలెక్టర్ ఆరా తీశారు. కేంద్రంలో ఎంతమంది చిన్నారులు ఉన్నారు, వారికి అందుతున్న సౌకర్యాలపై అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కేంద్రం ఆవరణలో మొక్కలు నాటి పచ్చదనం పెంపొందించాలని పిలుపునిచ్చారు.
గ్రామంలోని ప్రతి చిన్నారి తప్పనిసరిగా విద్యను అభ్యసించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఒక్క విద్యార్థి కూడా చదువుకు దూరం కాకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న అంగన్‌వాడీ కేంద్రం ప్రారంభం కావడం సంతోషకరమని పేర్కొంటూ, దీనిని పరిశుభ్రంగా, భద్రంగా సంరక్షించాలని సూచించారు. నర్వ మండలంలో యాస్పిరేషన్ బ్లాక్ కార్యక్రమం కింద ప్రభుత్వం అనేక అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తోందని కలెక్టర్ తెలిపారు. గ్రామాల అవసరాలకు అనుగుణంగా కొత్త ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పిస్తే అందుబాటులో ఉన్న నిధులతో ఆమోదం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని హామీ ఇచ్చారు. మండలంలోని అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులు, సర్పంచ్‌లను ఆదేశించారు. ఉపాధి హామీ పథకం కింద మరుగుదొడ్ల నిర్మాణం, ఇతర మౌలిక సదుపాయాల పనులను త్వరగా పూర్తి చేస్తే బిల్లులు కూడా వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రతి శాఖ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు పత్తి, వరి వంటి సంప్రదాయ పంటలకు బదులుగా కందులు, పెసర్లు వంటి స్వల్పకాలిక ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి రాజేందర్ గౌడ్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి వెంకటరాములు, తహసీల్దార్ మల్లారెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్, యాస్పిరేషన్ బ్లాక్ సమన్వయకర్త బాలాజీ, సీడీపీవో, గ్రామ పెద్దలు, అధికారులు పాల్గొన్నారు.

# మత్స్యకారులకు వాహనాల మంజూరు

- లక్కీ డ్రా ద్వారా లబ్ధిదారుల ఎంపిక
- జిల్లా కలెక్టర్ సమక్షంలో పారదర్శక ప్రక్రియ
- కేంద్ర పథకాల కింద వాహనాల పంపిణీ
- మత్స్యకారుల సంక్షేమానికి మరో ముందడుగు



**ఆదిలాబాద్, జూలై 30 (మన విశ్వం ):** మత్స్యకారుల జీవనోపాధిని మెరుగుపర్చే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ధర్తీ ఆబా జనజాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్, ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకాల కింద ద్విచక్ర, త్రిచక్ర వాహనాల మంజూరు కోసం లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను గురువారం ఆదిలాబాద్‌లో నిర్వహించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రాజర్షి షా హాజరై ఎంపిక ప్రక్రియను పర్యవేక్షించారు. లబ్ధిదారుల ఎంపికను లక్కీ డ్రా విధానంలో పారదర్శకంగా నిర్వహించారు. అర్హులైన దరఖాస్తుదారుల వివరాలను పరిశీలించిన అనంతరం నిబంధనలకు అనుగుణంగా ఎంపిక చేపట్టారు. ఎంపిక ప్రక్రియలో పారదర్శకతకు ప్రాధాన్యం ఇచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు నిజమైన అర్హులకు అందేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మత్స్యకారుల ఆదాయాన్ని పెంచడం, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన, ధర్తీ ఆబా జనజాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ పథకాల ద్వారా మత్స్యకారులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంతో పాటు వారి ఉపాధి అవకాశాలను విస్తరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని అధికారులు వివరించారు. ఈ వాహనాల మంజూరుతో చేపల రవాణా, మార్కెటింగ్ మరింత సులభతరం కానుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి సాంబశివరావు, జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్, జిల్లా ప్రధాన బ్యాంకు అధికారి ఉత్పల్ కుమార్, మత్స్యకార సంఘాల నాయకులు, మత్స్యకారులు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. లక్కీ డ్రా ప్రక్రియను అధికారులు పారదర్శకంగా నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత, జవాబుదారీతనానికి ప్రాధాన్యం ఇస్తూ అర్హులైన లబ్ధిదారులకు ప్రయోజనాలు అందించేందుకు జిల్లా యంత్రాంగం కట్టుబడి ఉందని అధికారులు తెలిపారు. రానున్న రోజుల్లో కూడా మత్స్యకారుల అభివృద్ధికి చేపట్టే కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేయనున్నట్లు వెల్లడించారు.

# "తాటి బొత్తలెక్కే మా గౌడన్న" ప్రోమో ఆవిష్కరణ

- మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ చేతుల మీదుగా ఆవిష్కరణ
ఆగస్టు 9 కార్యక్రమానికి ఆహ్వానం
- సర్దార్ పాపన్న, గౌతు లచ్చన్న జయంతి వేడుకలకు ఏర్పాట్లు



**హైదరాబాద్, జూలై 30 (మన విశ్వం ):** "తాటి బొత్తలెక్కే మా గౌడన్న" పాట ప్రోమోను మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ చేతుల మీదుగా హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘాల ప్రతినిధులు, సామాజిక నాయకులు, కళాకారులు పాల్గొన్నారు. గౌడ సమాజ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా రూపొందించిన ఈ పాట ప్రోమోను ఆవిష్కరించిన అనంతరం నిర్వాహ కులను మాజీ మంత్రి అభినందించారు. ఈ కార్యక్రమంలో జై గౌడ సేన జాతీయ అధ్యక్షుడు గండి సుజన్ గౌడ్, మోర్ల ఏడుకొండల గౌడ్, అఖిల భారత గౌడ ఐక్యవేదిక కన్వీనర్ కోళ్ల ఈశ్వర్ ప్రసాద్ గౌడ్, రచయిత బాల సాయి గౌడ్, రవి ఉట్కూరి, పగిండ్ల మురళి, ఇంద్రకంటి వంశీ తదితరులు పాల్గొన్నారు. గౌడ సమాజ చరిత్ర, వారసత్వాన్ని యువతకు చేరవేసే ప్రయత్నాలను వారు అభినందించారు.
పాట ప్రోమో ఆవిష్కరణ సందర్భంగా గౌడ సమాజ ఐక్యత, సామాజిక చైతన్యం, సాంస్కృతిక వారసత్వ పరిరక్షణపై నాయకులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఇటువంటి సాంస్కృతిక కార్యక్రమాలు సమాజ చరిత్రను భావితరాలకు పరిచయం చేయడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. అనంతరం జై గౌడ సేన జాతీయ సంఘం ప్రతినిధులు మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఆగస్టు 9న విజయవాడ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించనున్న కార్యక్రమానికి ఆహ్వానించారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహారాజ్, సర్దార్ గౌతు లచ్చన్న జయంతి వేడుకల సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు.విజయవాడలో జరిగే కార్యక్రమంలో బహుజన సర్దార్ల జెండా ఆవిష్కరణతో పాటు ఉచిత జెండాల పంపిణీ చేపట్టనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి వివిధ సామాజిక సంఘాల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో గౌడ సమాజ సభ్యులు హాజరుకానున్నట్లు తెలిపారు. సామాజిక చైతన్యం, చారిత్రక వారసత్వ పరిరక్షణ, బహుజన నాయకుల సేవలను భావితరాలకు పరిచయం చేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఆగస్టు 9న విజయవాడలో జరిగే జయంతి వేడుకలను విజయవంతం చేయడానికి సమాజ సభ్యులందరూ పాల్గొని సహకరించాలని పిలుపునిచ్చారు.

## ఫ్యాషన్ షో మాత్రమే కాదు.. అదొక దృశ్య కావ్యం.. అందరినీ మంత్రముగ్ధుల్ని చేసిన శోభిత ధూళిపాళ్ల దేవి అవతారం!



ఫ్యాషన్ ప్రపంచంలో కొన్ని ఘట్టాలు కేవలం ర్యాంప్ వాక్‌కే పరిమితం కాకుండా చరిత్రలో నిలిచిపోతాయి. ఇండియా కూటూర్ వీక్ (×జఔ) 2026 గ్రాండ్ ఫినాలేలో డిజైనర్ రాహుల్ మిశ్రా, నటి శోభితా ధూళిపాళ్ల కలిసి అలాంటి అద్భుతాన్నే ఆవిష్కరించారు. ప్యారిస్‌లో మెప్పించిన ఇవజఱ: ఎ్రవ జ్వతీఖశ్రీ వీబంవ కలెక్షన్‌ను మన దేశీయ వేదికపై ప్రదర్శిస్తూ, ర్యాంప్‌పైనే లైవ్‌లో ఒక దేవి రూపంలోకి రూపాంతరం చెందడం అందరినీ ఆకట్టుకుంది. దక్షిణ భారత ఆలయ శిల్పాల ఆధ్యాత్మికతను, భారతీయ కళాకారుల చేతివృత్తి నైపుణ్యాన్ని ఈ ప్రదర్శన అత్యంత నాటకీయంగా చాటిచెప్పింది.ఫ్యాషన్ అనేది కేవలం వస్త్రధారణకే పరిమితం కాకుండా ఎప్పటికీ గుర్తిండిపోయే అద్భుతమైన క్షణాలను మిగులుస్తుంది. ఇండియా కూటూర్ వీక్ 2026 గ్రాండ్ ఫినాలేలో హీరో నాగచైతన్య సతీమణి, నటి శోభితా ధూళిపాళ్ల సరిగ్గా అలాంటి ఓ మరుపురాని ఘట్టాన్ని ఆవిష్కరించారు. డిజైనర్ రాహుల్ మిశ్రా ప్రదర్శనలో కేవలం షోస్టాపర్‌గానే కాకుండా, ఒక దివ్యమైన శక్తి రూపాంతరంగా నిలిచి ఆ ప్రదర్శనకు ముగింపు పలికారు.
ర్యాంప్‌పై నడుస్తున్న కొద్దీ లైవ్‌లోనే అద్భుతమైన ప్రదర్శనను కనబరిచింది. ప్రేక్షకులు ఆశ్చర్యంతో వీక్షిస్తుండగా ఆమె క్రమంగా దేవీ రూపంలోకి మారిన తీరు మైమరపించింది. ఈ డ్రామా స్టైల్ ప్రదర్శణ కేవలం డిజైనర్ దుస్తులను ప్రదర్శించడానికే కాకుండా.. ఫ్యాషన్, అభినయం ద్వారా భారతదేశపు కళాత్మక వారసత్వాన్ని కొనసాగించారని చెప్పొచ్చు.
ర్యాంప్ వాక్ కంటే అద్భుతంగా..రెగ్యులర్ ఫ్యాషన్ ముగింపుల వలే కాకుండా శోభితా ప్రదర్శన ఒక సుందరమైన దృశ్య కావ్యంగా సాగింది. చాలా నిరాండబరమైన దుస్తుల స్టైల్‌తో ప్రారంభమైన ఆమె రూపం, వేదికపైనే మలచబడిన శిల్ప శోభితమైన ఆకృతులతో, దైవికమైన అలంకరణతో క్రమంగా ఒక దేవత రూపంలోకి రూపాంతరం చెందింది.
మీరు మెచ్చే కథనాలు"పీరియడ్స్ వచ్చాయని శోభనం వాయిదా.. షేవింగ్ చేసుకుంటూ కనిపించిన నవ వధువు".. ట్రాన్స్‌జెండర్ అంటూ భర్త ఆరోపణ
వైఎస్ కుటుంబంలో తీవ్ర విషాదం.. జగన్ పెద్దనాన్న మృతి, ఈ ఏడాదిలోనే ఇద్దరు!
నీట్ నిరసనల్లో ప్రధాని మోదీపై అనుచిత వ్యాఖ్యలు.. విద్యార్థినిపై జీరో ఎఫ్ఐఆర్ నమోదు
'పెద్ది'కి వచ్చింది హార్ట్ ఎటాక్ కాదు.. విషమంగానే పరిస్థితి.. తుది నిర్ణయం కుటుంబానిదే: హరీష్ రావు
ఈ లైవ్ చూస్తే రాహుల్ మిశ్రా యొక్క తాజా కూటుర్ భావజాలానికి అద్దం పట్టింది. స్త్రీత్వంలోని దైవిక శక్తిని కేవలం దుస్తుల రూపంలోనే కాకుండా భావోద్వేగం, వ్యక్తిత్వం, అద్భుతమైన చేతి వృత్తి నైపుణ్యాల ద్వారా ఈ ప్రదర్శన చాటి చెప్పింది. ఫలితంగా ఈ ర్యాంప్ ప్రదర్శన సాధారణ ఫ్యాషన్ షోల మాదిరిగా కాకుండా ఒక గొప్ప నాటకీయ రసకావ్యాన్ని గుర్తుచేసింది.స్త్రీత్వంలోని దైవిక శక్తికిఇటీవలే ప్యారిస్ హాట్ కూటూర్ వీక్‌లో అరంగేట్రం చేసిన రాహుల్ మిశ్రా యొక్క 'ఇవజఱ: ఎ్రవ జ్వతీఖశ్రీ వీబంవ' కలెక్షన్, ఐసీడబ్ల్యూ 2026 వేదికగా భారత్‌కు తిరిగి వచ్చింది. దక్షిణ భారతదేశంలోని శతాబ్దాల నాటి ఆలయ శిల్పాల నుంచి ప్రేరణ పొందిన ఈ కలెక్షన్, రాతి శిల్పాలను పవిత్రమైన వాస్తు శిల్పాన్ని, దేవతల ప్రతీకలను అత్యంత నిశితమైన ఎంబ్రాయిడరీ, శిల్ప సదృశ్యమైన డిజైన్ల ద్వారా ఫ్యాషన్ రూపంలో కొత్తగా ఆవిష్కరించింది.
దేవి కాన్సెప్ట్‌ను మన సొంత దేశానికి తీసుకురావడం ఈ షో పూర్తిస్థాయిలో సంపూర్ణమైనట్లు అనిపిస్తోంది. వెయ్యేళ్ల క్రితం చెక్కిన ఒక రాతి విగ్రహంతో ఈ ఆలోచన మొదలైంది. ఒక శిల్పి రాతిని మలిచి రూపాన్ని వెలికితీస్తే మేము దానిని అనుసరిస్తూ వెళ్లాము. ఆ ఎంబ్రాయిడరీ రాతి శిల్పంలా కనిపించేంత వరకు దారంతో దారాన్ని అల్లుకుంటూ వెళ్లాము అని రాహుల్ మిశ్రా వివరించారు. తన స్టూడియోలోని ప్రతీ చేతివృత్తి కళాకారుడు, ప్రతీ యువ డిజైనర్ వల్లనే ఈ ఆలోచన సాధ్యమైందని, దీనిని భారతదేశంలో ప్రదర్శించడం అత్యంత అర్థవంతమైనదని పేర్కొన్నారు.ముఖ్య గమనిక: ఈ కథనంలోని సమాచారం కేవలం అవగాహన కోసం మాత్రమే. వీటిని ఎంత వరకు విశ్వసించాలనేది పూర్తిగా మీ వ్యక్తిగత విషయం. సమయం తెలుగు వీటిని ధృవీకరించడం లేదు.

## రాత్రి పూట కూడా బీపీ తగ్గకపోతే నిర్లక్ష్యం చేయకండి



ప్రస్తుత లైఫ్‌స్టైల్ కారణంగా చాలా మంది రక్తపోటుతో బాధపడుతున్నారు. బీపీకి క్రమం తప్పకుండా మందులు వాడటం, ఆహార నియమాలు పాటించడం చాలా ముఖ్యం. సాధారణంగా బీపీ రాత్రిపూట తగ్గుతుంది. కానీ, రాత్రి పూట కూడా తగ్గకుండా పగటి వేళ ఎంత ఉందో అంతే స్థాయిలో ఉంటే మాత్రం అలర్ట్ అవ్వాలి. దీనిని నాన్ డిప్పర్ బ్లడ్ ప్రెజర్ అంటారు.సాధారణంగా మనం రాత్రి నిద్రపోతున్నప్పుడు రక్తపోటు (బీపీ) 10% నుంచి 20% వరకు తగ్గుతుంది. దీనివల్ల గుండెకు, రక్తనాళాలకు రాత్రి వేళ తగినంత విశ్రాంతి దొరుకుతుంది. దీనిని "డిప్పింగ్ పాటర్న్" అంటారు. అయితే, "నాన్-డిప్పర్" రకం బీపీ ఉన్నవారిలో రాత్రివేళ రక్తపోటు తగ్గదు; పైగా పగటివేళ ఎంత ఉందో రాత్రి కూడా అంతే స్థాయిలో ఉంటుంది. సాధారణంగా ఆసుపత్రిలో ఒకేసారి తీసే బీపీ రీడింగ్ ద్వారా ఇది బయటపడదు. దీనిని గుర్తించడానికి 24 గంటల ఆంబ్యులేటరీ బ్లడ్ ప్రెజర్ మానిటరింగ్ (ఏబీపీఎం) పరీక్ష అవసరం.వృద్ధులు, అధిక రక్తపోటు, డయాబెటిస్, మూత్రపిండాల వ్యాధులు, స్థూలకాయం లేదా నిద్రలేమి సమస్యలు ఉన్నవారిలో ఈ నాన్-డిప్పింగ్ సమస్య ఎక్కువగా కనిపిస్తుంది. దీనికి ఎలాంటి స్పష్టమైన లక్షణాలు ఉండవు కాబట్టి, చాలామందికి తమకు ఈ సమస్య ఉందనే విషయమే తెలియదు. భవిష్యత్తులో గుండె సంబంధిత ప్రమాదాలను తగ్గించడానికి ఈ పాటర్న్‌ను గుర్తించడం చాలా ముఖ్యం. నాన్-డిప్పర్ బ్లడ్ ప్రెజర్‌పై మరింత సమాచారాన్ని డాక్టర్ సంజయ్ భట్ (సీనియర్ కన్సల్టెంట్ - ఇంటర్వెన్షనల్ కార్డియాలజీ, ఆస్టర్ సిఎమ్ఐ హాస్పిటల్, బెంగళూరు) అందించారు. ఆ పూర్తి వివరాలేంటో ఇప్పుడు తెలుసుకుందాం. అబ్‌స్ట్రక్టివ్ స్లీప్ అప్నియా: నిద్రలో శ్వాస తాత్కాలికంగా ఆగిపోయే ఈ సమస్య వల్ల శరీరంలో ఒత్తిడి హార్మోన్లు పెరిగి, రాత్రివేళ బీపీ ఎక్కువగా ఉంటుంది.
ఇతర ఆరోగ్య సమస్యలు: సరిగ్గా నిద్రపట్టకపోవడం, మానసిక ఒత్తిడి, స్థూలకాయం, షుగర్ వ్యాధి, దీర్ఘకాలిక మూత్రపిండాల వ్యాధులు, హార్మోన్ల అసమతుల్యత.జీవనశైలి లోపాలు: ఆహారంలో ఉప్పు ఎక్కువ తీసుకోవడం, అతిగా మద్యం సేవించడం, పొగతాగడం, కొన్ని రకాల మందుల వాడకం.
శరీర అంతర్గత గడియారం కొందరిలో శరీర నాడీ వ్యవస్థ లేదా అంతర్గత గడియారం రాత్రి వేళల్లో బీపీని సరిగ్గా నియంత్రించలేదు.
మూల కారణానికి చికిత్స చేయడం, నిద్ర నాణ్యతను పెంచుకోవడం, మంచి జీవనశైలి అలవాట్లను పాటించడం ద్వారా ఆరోగ్యకరమైన బీపీ స్థాయిల్ని తిరిగి పొందొచ్చు.అవును, నాన్-డిప్పర్ బీపీ ప్రమాదకరమే. రాత్రివేళ బీపీ తగ్గకపోవడం వల్ల గుండె, రక్తనాళాలు రాత్రంతా కష్టపడాల్సి వస్తుంది. దీనివల్ల కాలక్రమేణా గుండెపోటు , పక్షవాతం గుండె వైఫల్యం మూత్రపిండాలు, రక్తనాళాలు దెబ్బతినే ప్రమాదం గణనీయంగా పెరుగుతుంది.పరీక్ష ద్వారా నిర్ధారణ: మొదట 24 గంటల బీపీ మానిటరింగ్ ద్వారా దీనిని నిర్ధారించుకోవాలి.మందులు , జీవనశైలి మార్పులు: డాక్టర్ సూచించిన బీపీ మందుల్ని క్రమం తప్పకుండా వాడాలి. బరువు తగ్గడం, ఉప్పు తగ్గించడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, మద్యం, పొగతాగడం పూర్తిగా మానేయడం మంచిది.

VOICE OF THE PEOPLE-POWER OF TRUTH
తెలుగు వార్తా దినపత్రిక

# మరో లవ్ గ్రాక్ మూవీ శ్రీనివాస మంగాపురం

### - ఆకట్టుకున్న జయకృష్ణ, రాషా తండానీ నటన




ఘట్టమనేని కుటుంబం నుంచి యువ హీరోగా పరిచయమవుతున్న జయకృష్ణ, ప్రముఖ నటి రవీనా టండన్ కూతురు రాషా తడాని జంటగా నటించిన తాజా చిత్రం 'శ్రీనివాస మంగాపురం'. 'ఆర్ఎక్స్ 100', మంగళవారం వంటి సంచలన చిత్రాల తర్వాత దర్శకుడు అజయ్ భూపతి తెరకెక్కించిన ఈ చిత్రంపై మొదటి నుంచి భారీ అంచనాలున్నాయి. మోహన్ బాబు, శ్యామ్, బ్రహ్మాజీ వంటి హేమాహేమీలు ప్రధాన పాత్రలు పోషించిన ఈ సినిమా నేడు ప్రేక్షకుల ముందుకు వచ్చింది. తిరుపతి నేపథ్యంతో ఈ కథ సాగుతుంది. నగరంలో అడుగుపెట్టిన యువకుడు శ్రీను (జయకృష్ణ) .. అక్కడి పవర్ ఫుల్ వ్యక్తి పెద్దిరెడ్డి (శ్యామ్) గారాల కూతురు మంగ (రాషా తడాని)ని మొదటి చూపులోనే ఇష్టపడతాడు. ఆమెకు చేరువయ్యే ప్రయత్నంలో ఉండగా, మంగ జీవితానికి సంబంధించి ఒక షాకింగ్ నిజం తెరపైకి వస్తుంది. అసలు ఆ రహస్యాన్ని పెద్దిరెడ్డి ఎందుకు దాచాడు? శ్రీను నేపథ్యం ఏమిటి? మంగతో అతనికి ఉన్న పాత సంబంధం ఏంటి? బళ్లారి ప్రాంతానికి చెందిన వెంకటప్పయ్య (మోహన్ బాబు), లక్ష్మీపతి (అజయ్)ల మధ్య జరిగిన వివాదాలు ఈ కథను ఎలాంటి మలుపులు తిప్పాయి? చివరికి శ్రీను తన ప్రేమను ఎలా గెలుచుకున్నాడు అనేదే ఈ చిత్ర అసలు కథ. దర్శకుడు అజయ్ భూపతి కూడా 'శ్రీనివాస మంగాపురం' కోసం ఇదే రొటీన్ మాస్ కమర్షియల్ బాటపట్టారు. స్టోరీ పరంగా పెద్దగా కొత్తదనం లేకపోయినా.. విలన్ క్రూరత్వం, హీరోయిన్ వెనక హీరో పడే లవ్ ట్రాక్, మధ్య మధ్యలో వచ్చే పాటలతో ప్రథమార్థం సాగిపోతుంది. జై కృష్ణ తన డాన్సులతో అలరించగా, నరేష్, బ్రహ్మాజీల కామెడీ మంచి రిలాక్సేషన్ ఇస్తుంది. ద్వితీయార్థంలో వచ్చే ఫ్లాష్ బ్యాక్, హీరో హీరోయిన్ల అసలు కథ, యాక్షన్ సీక్వెన్సెస్ ఎమోషనల్‌గా కనెక్ట్ అవుతాయి. తన గత చిత్రాల తరహాలో కాకుండా, అజయ్ భూపతి ఎలాంటి రిస్క్ తీసుకోకుండా పూర్తిగా 'సేఫ్ గేమ్' ఆడేశారు. పకడ్బందీ స్క్రీన్ ప్లే, బలమైన క్యారెక్టరైజేషన్స్‌పై మరికాస్త దృష్టి పెట్టి ఉంటే ఈ లవ్ అండ్ యాక్షన్ డ్రామా మరో స్థాయిలో ఉండేది. జయకృష్ణ, రాషా తడాని తమ తొలి సినిమాతోనే అద్భుతమైన ప్రతిభను కనబరిచారు.

# రామాయణ ట్రైలర్ విడుదల




### - అద్భుత దృశ్య కావ్యంగా మలచిన నితీశ్ తివారి

ఎన్నిసార్లు విన్నా.. ఎంతమంది చెప్పినా.. ఎన్ని యుగాలు మారినా అజరామరం రామ చరితం.. 'రామాయణం' నిత్యనూతనం. ఇప్పటికే ఎన్నోసార్లు దృశ్యరూపం దాల్చిన ఈ మహాకావ్యం ఇప్పుడు మరోసారి నేటితరం ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది.దర్శకుడు నితీశ్ తివారీ మలిచిన 'రామాయణ' ట్రైలర్ బ్రహ్మ ముహూర్తంలో ప్రేక్షకుల ముందుకొచ్చింది. అత్యున్నత నిర్మాణ విలువలు, అద్భుతమైన విజువల్ ఎఫెక్ట్స్, అబ్బురపరిచేలా ఉన్న హాలీవుడ్ స్థాయి గ్రాఫిక్స్ ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తున్నాయి. సీతారాముల కల్యాణం, వనవాసం, రామరావణుడి యుద్ధం.. ఇలా ప్రతి ఫ్రేమ్ ఆ అద్భుత గాథను కళ్లకు కడుతోంది. దేవలోకం.. భూలోకం.. పాతాళలోకం.. ముల్లోకాల్లో ఇక ఒక్కటే సామ్రాజ్యం.. రావణ రాజ్యం' అంటూ యశ్ పాత్రను పరిచయం చేస్తూ ట్రైలర్ ప్రారంభమైంది. యశ్ స్క్రీన్‌పై కనిపించిన ప్రతిసారీ తన గాంభీర్యం ప్రేక్షకులను మైమరిపించింది. 'చీకట్లను పారదోలేందుకు ప్రతి యుగంలోనూ ఆ శ్రీమహావిష్ణువు అవతారమెత్తుతాడు' అంటూ రాముడి పాత్రను తీర్చిదిద్దిన విధానం ఆకట్టుకుంది. ప్రశాంతత, ధర్మనిష్ఠను ప్రతిబింబించే రాముడిగా రణ్‌బీర్ కపూర్ ఆకట్టుకున్నారు. మొత్తం నాలుగు నిమిషాల ఈ ట్రైలర్ సినీ ప్రేక్షకులను త్రేతాయుగానికి తీసుకెళ్లింది. ట్రైలర్‌లో ఎక్కువ చర్చిస్తున్న పాత్రల్లో ఒకటి సీతాదేవి. సాధారణంగా మృదుస్వభావిగా చూపించే సీతమ్మను ఇందులో ఖడ్గం పట్టిన యోధురాలిగా చూపించారు. లక్ష్మణ రేఖ సందర్భంలో కూడా ఆమె చేతిలో ఖడ్గం కనిపించడంతో ఇందులో ఆమె పాత్రను కొత్తగా చూపించనున్నట్లు అర్థమవుతోంది. పుష్పక విమానం రామాయణంలో ఎంతో కీలకం. గతంలో వచ్చిన చిత్రాల్లో ఇది సాధారణంగా కనిపించినా.. ఈ సినిమాలో మాత్రం భారీ తామరపువ్వు ఆకారంలో ప్రత్యేక డిజైన్‌తో చూపించారు. ఇక, లంకను జయించిన తర్వాత మూడు లోకాలపై ఆధిపత్యం సాధించాలని రావణుడు సంకల్పిస్తాడు. ఈ క్రమంలో దేవేంద్రుడితో యుద్ధానికి సంబంధించిన సన్నివేశాల్లో ఐరావతాన్ని అద్భుతమైన విజువల్‌తో ఆవిష్కరించారు. సీతను అపహరించే సమయంలో రావణుడిని అడ్డుకునే జటాయువు పాత్రకు ట్రైలర్‌లో మంచి ప్రాధాన్యం దక్కింది. భారీ గరుత్మంతుడిలా, శక్తిమంతమైన రూపంలో జటాయువును చూపించడం విశేషం. శూర్పణఖ భర్త విద్యుజ్జిహ్వ పాత్రలో వివేక్ ఒబెరాయ్ కనిపించారు. రావణుడికి ఆయనకు మధ్య జరిగే ఘర్షణ చూస్తుంటే.. ఇప్పటివరకూ రామాయణంలో తెరపైకి రాని పాత్రలకు కూడా సముచిత స్థానం కల్పించినట్లు తెలుస్తోంది. రాముడి వనవాసానికి కారణమైన మంథర పాత్రను శీబా చద్దా పోషించారు. కైకేయిగా లారా దత్త ప్రత్యేకంగా కన్పించారు. శివధనుస్సు విరిచిన అనంతరం పరశురాముడు రాముడిని కలిసే ఘట్టం కూడా ట్రైలర్‌లో ఉంది. తన ధర్మ బాధ్యతలను రాముడికి అప్పగించి తపస్సు కోసం వెళ్లే పరశురాముడి పాత్రలోనూ రణ్‌బీర్ కన్పించడం ప్రేక్షకులను సర్‌ప్రైజ్ చేసింది. రాముడిని తిరిగి అయోధ్యకు తీసుకురావడానికి చిత్రకూటానికి వెళ్తాడు భరతుడు. రాముడు నిరాకరించడంతో ఆయన పాదుకలను సింహాసనంపై ఉంచి రాజ్యాన్ని పాలించిన సోదరుడిగా ఆదినాథ్ కొఠారే ఆకట్టుకున్నారు. హనుమంతుడిగా సన్నీ దేవోల్, లక్ష్మణుడిగా రవీ దూబే కూడా తమ పాత్రలకు న్యాయం చేశారు. రకుల్ ప్రీత్ సింగ్ శూర్పణఖ పాత్రలో కనిపించి ఔరా అనిపించారు. రాముడిని ఆకర్షించేందుకు ప్రయత్నించడం, లక్ష్మణుడు ఆమె ముక్కు కోసే సన్నివేశాలు ప్రత్యేకంగా నిలిచాయి. 'ప్రతీకారం తీర్చుకుంటాను శూర్పణఖ.. రాముడికి జరిగే అవమానం ఘోరంగా ఉంటుంది' అంటూ యశ్ చెప్పే డైలాగ్‌తో రామ-రావణ యుద్ధం ఎంత భీకరంగా ఉంటుందో ట్రైలర్‌లో హింట్ ఇచ్చారు దర్శకుడు. ఇక ట్రైలర్‌లో ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన మరో విషయం.. నేపథ్య సంగీతం.. ప్రపంచ ప్రఖ్యాత సంగీత దర్శకుడు హాన్స్ జిమ్మర్‌తో పాటు ఏ.ఆర్. రెహమాన్ అందించిన సంగీతం సినిమా స్థాయిని మరింత పెంచేలా ఉంది.

# నవ్వుతో కట్టిపడేస్తున్న ప్రగ్యా జైశ్వాల్..

**కంచె, అఖండ, అఖండ 2, డాకు మహారాజ్ సినిమాలతో తెలుగులోమంచి ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించుకుంది ప్రగ్యా జైశ్వాల్. ఈ జబల్ పూర్ బ్యూటీ నెట్టింట యాక్టివ్‌గా ఉంటూ ఫాలోవర్లలో జోష్ నింపుతుంటుంది. సోషల్ మీడియాలో తనకు సంబంధించిన అప్‌డేట్స్‌ను షేర్ చేసుకునే ప్రగ్యాజైశ్వాల్ తాజాగా పోస్ట్ చేసిన ఫొటోలు కుర్రకారుకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి.ప్రగ్యాజైశ్వాల్ సెలబ్రిటీ, ఫ్యాషన్ స్టైలిస్ట్ నటాషా బోత్రా అండ్ టీం డిజైన్ చేసిన ట్రెండీ కాస్ట్యూమ్స్‌లో హొయలు పోయింది. బ్లూ అండ్ వైట్ చారలతో డిజైన్ చేసిన డ్రెస్‌లో చిరునవ్వులు చిందిస్తూ కెమెరాకు ఫోజులిచ్చింది. ఈ ఫొటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది. 'చారలు తిరిగి వచ్చాయని విన్నా..' అంటూ ఈ స్టిల్స్‌కు క్యాప్షన్ ఇచ్చింది.చూసేందుకు రెండు కళ్లు చాలవన్నట్టుగా ఉన్న ప్రగ్యాజైశ్వాల్ స్టిల్స్ ఇప్పుడు నెట్టింట ట్రెండింగ్ అవుతున్నాయి. ప్రస్తుతం బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా నటిస్తున్న టైసన్ నాయుడులో ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది ప్రగ్యాజైశ్వాల్.**



# విశ్వంభరతో పోటీ పడనున్న జైలర్-2



అగ్ర కథానాయకుడు మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు వేడుకలను ఘనంగా జరుపుకోవడానికి ఆయన అభిమానులు ఇప్పటినుంచే ఇప్పటి నుంచే ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. అయితే ఆగష్టు 22న రానున్న మెగాస్టార్ బర్త్ డే కానుకగా ఆయన నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ సోషియో-ఫాంటసీ చిత్రం 'విశ్వంభర' నుంచి అదిరిపోయే అప్‌డేట్ రాబోతున్నట్లు తెలుస్తుంది. దర్శకుడు మల్లిడి వశిష్ట తెరకెక్కిస్తున్న ఈ భారీ బ్జడెట్ చిత్రం, విజువల్ ఎఫెక్ట్స్ పనుల కారణంగా ఇంతకాలం ఆలస్యం అయినప్పటికీ, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలను శరవేగంగా ముగింపు దశకు తీసుకువచ్చింది. యూవీ క్రియేషన్స్ సంస్థ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రంలో అందాల తార త్రిష నటిస్తుండగా, ఆస్కార్ విజేత ఎం.ఎం. కీరవాణి అద్భుతమైన బాణీలు, నేపథ్య సంగీతాన్ని అందిస్తున్నారు. కాగా, ఈ సోషియో-ఫాంటసీ అడ్వెంచర్‌ను దసరా పండుగకు టా÷-గ్గ÷ట్ చేస్తూ అక్టోబర్ 16న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేసేందుకు మేకర్స్ ఎ÷-లాన్ చేస్తున్నట్లు తెలుస్తుంది. ఇందుకు సంబంధించిన అధికారిక ప్రకటన ఆగస్టు 22న చిరంజీవి జన్మదిన వేడుకల సందర్భంగా చిత్రబృందం ప్రకటించబోతున్నట్లు సమాచారం. అయితే చిరంజీవి దసరా పండుగకు రాబోతుండటం అంతకంటే ఒక్కరోజు ముందుగానే రజనీకాంత్ జైలర్ 2 ప్రేక్షకులు రాబోతుండడంతో ఈ రెండు సినిమాలకు బాక్సాఫీస్ వద్ద బిగ్ క్లాష్ ఉండబోతున్నట్లు తెలుస్తుంది

# సూర్య 47 దీపావళి బరికోసం సిద్ధం




తమిళ స్టార్ హీరో సూర్యకు ఇప్పటికే వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. రీసెంట్ గా జితు మాధవన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'సూర్య47' షూటింగ్‌ను పూర్తి చేశారు. చిత్రబృందం విడుదల చేసిన బీహైండ్ ది సీన్స్ వీడియోతో షూటింగ్ ముగిసిన విషయాన్ని అధికారికంగా వెల్లడించగా, ఇప్పుడు ఈ సినిమా విడుదల తేదీపై ఆసక్తికర చర్చ మొదలైంది. అందుతున్న సమాచారం ప్రకారం, 'సూర్య47'ను ఈ దీపావళి సందర్భంగా థియేటర్లలో విడుదల చేయాలని నిర్మాతలు భావిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే దీనిపై చిత్రబృందం నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. ఈ వార్త నిజమైతే సూర్యకు ఇది వరుసగా మూడో థియేట్రికల్ విడుదలగా నిలవనుంది. ఇప్పటికే 'కరుప్పు'తో ప్రేక్షకులను పలకరించిన ఆయన, ఆగస్టు 14న వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'విశ్వనాథ్ అండ్ సన్స్'తో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఆ సినిమా విడుదలైన కొద్ది నెలలకే 'సూర్య47' కూడా థియేటర్లలోకి వస్తే, ఒకే ఏడాదిలో వరుసగా మూడు సినిమాలతో అభిమానులను అలరించిన హీరోగా సూర్య నిలుస్తారు. అయితే దీపావళి బరిలో వెట్రిమారన్ దర్శకత్వంలో సిలంబరసన్ టి.ఆర్ నటిస్తున్న 'అరసన్' కూడా విడుదలకు సిద్ధమవుతుండటంతో బాక్సాఫీస్ వద్ద ఆసక్తికర పోటీ నెలకొనే అవకాశం కనిపిస్తోంది.

# లెనిన్ సరికొత్త రికార్డులు

### - వందకోట్ల క్లబ్బులో అఖిల్ లెనిన్ చేరిక

టాలీవుడ్ యువ సామ్రాట్ అఖిల్ అక్కినేని కెరీర్‌లో ఓ సరికొత్త చరిత్రాత్మక అధ్యాయం మొదలైంది. ఆయన నటించిన మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ లెనిన్ చిత్రం బాక్సాఫీస్ వద్ద అద్భుతాలు సృష్టిస్తూ, ప్రపంచవ్యాప్తంగా రూ.100 కోట్ల గ్రాస్ వసూళ్ల మైలురాయిని విజయవంతంగా అధిగమించింది. దీంతో అఖిల్ కెరీర్‌లో తొలి బ్లాక్ బస్టర్‌ను నమోదు చేయడంతో పాటు తొలి రూ.100 కోట్ల సినిమాగా రికార్డుల కెక్కింది. జూలై 10న భారీ అంచనాల మధ్య ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా, తొలి ఆట నుంచే పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకుని బాక్సాఫీస్ వద్ద ప్రభంజనం సృష్టించింది. దర్శకుడు మురళి కిషోర్ అబ్బూరు ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ముఖ్యంగా సినిమాలో అఖిల్ కొత్త మేకోవర్, పవర్ ప్యాక్డ్ మాస్ యాక్షన్ సీక్వెన్స్‌లు, హై-ఓల్టేజ్ ఎమోషనల్ సన్నివేశాలు థియేటర్లలో ప్రేక్షకులను కట్టిపడేశాయి. టాలీవుడ్ ప్రముఖ నిర్మాణ సంస్థలు సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, అన్నపూర్ణ స్టూడియోస్ సంయుక్తంగా అత్యున్నత నిర్మాణ విలువలతో ఈ చిత్రాన్ని నిర్మించాయి. నిర్మాత నాగవంశీ, నాగార్జున అనుసరించిన పబ్లిసిటీ వ్యూహాలు సినిమా విజయంలో కీలక పాత్ర పోషించాయి. ఇక తమ అభిమాన హీరో అఖిల్ ఖాతాలో తొలి బి÷-గగెస్ట్ బ్లాక్‌బస్టర్ హిట్ పడటంతో అక్కినేని అభిమానులు సోషల్ మీడియా వేదికగా పెద్ద ఎత్తున సంబరాలు చేసుకుంటున్నారు. సినిమా విజయాన్ని పురస్కరించుకుని చిత్ర యూనిట్ కూడా సంతోషం వ్యక్తం చేస్తూ ప్రేక్షకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.




"MANA VISHWAM" vide PRGI Registration No. "TGTEL/26/A4450" Printed by SRI VENKATESWARA PRINTING SOLUTIONS, Published by Nameendla Pramod on behalf of Nameendla Pramod, printed at 11-1/B/42, BPM GREEN LANDS COLONY, PRVATHAPUR, MEDIPALLY MANDAL AND DIVISION, GHMC, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500098 and published at H No 2-96, Geesugonda, Gorrekunta editor Nameendla Pramod. Gmail- manavishwamtelugudaily@gmail.com, Cell- 6305638569